# దుర్గా నవరాత్రి శుభాకాంక్షలు

అక్టోబరు 2022

# చైతన్యం

రు. 20/-

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



11 వసంతాలు పూర్తి చేసుకుని 12 వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పాఠకులకు, రచయితలకు, ప్రకటనదారులకు

శుభాకాంక్షలు


దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకుంటున్న
ఆశా పరేఖ్


బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం


## సామాజిక విలువల మాస పత్రిక

**అక్టోబరు 2022**

సంపుటి -12 సంచిక - 1


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| పూరీ జగన్నాథస్వామి వైభవం | 6 |
| సుందరకాండ అనుబంధం- పురగీత | 8 |
| దక్షిణ కాశి ఆలంపురం ఆలయాలు | 9 |
| భక్తజన సంరక్షణ ఆదిపరాశక్తి | 10 |
| హితోక్తులు | 15 |
| బాలసాహిత్య భగీరథుడు | 16 |
| శ్రీ వచన భూషణం | 20 |


**గత 11 సంవత్సరాల పత్రిక సంచికల సింహావలోకనం**


**పేజీలు 22 - 50**



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## విజయదశమి శుభాకాంక్షలు

పాఠక దేవుళ్ళకు, సరస్వతీ పుత్రులయిన రచయితలకు, రచయిత్రులకు, వీడియో పత్రికలో రచయితలు వ్రాయడమే కాక , వీడియోలో చదువుతున్న రచయితలకు, రచయితలు వ్రాసి మనకి పంపుతున్న రచనలను చదివి ప్రోత్సహిస్తున్న రీడర్స్ కి, అలాగే గాయనీ గాయకులకు నవరాత్రి శుభాకాంక్షలు.

మన 'చైతన్యం సంకల్పబలం' పత్రిక 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంవసంతం లోకి ఆనందంగా ఉత్సాహంగా ఉరకలతో, విజయ దశమి రోజున మీ ముందుకు వస్తున్న శుభ సందర్భంలో ప్రపంచంలోని తెలుగు వారందరికీ విజయ దశమి శుభాకాంక్షలు. ఈ 12వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంలో 12 సంవత్సరాలుగా మన పత్రికలో ప్రచురించిన కొన్ని రచనలు ఈ పత్రిక ద్వారా మచ్చుకి మాత్రమే మీ ముందు ఉంచుతున్నాము. అందరివీ ఎక్కువ ఉంచలేము. కనుక అందరూ అర్థం చేసుకుని మన chaitanyam.net లో మన పత్రికలు ఎలాగూ ఉంటాయి కాబట్టి ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

## నవరాత్రి వైభవం ---- శక్తి ఆరాధన

నవరాత్రి అనేది శక్తిని ఆరాధించే పండుగ. హిందువుల పండుగ. ఇందులో దసరా పండుగలలో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారి దీక్షలో ఉండి, తొమ్మిది రూపాలలో ఉన్న శక్తిని ఆరాధిస్తారు. దుర్గాదేవి ద్వారా చెడుపై మంచి జరగడానికి అనేక రూపాలలో దుర్గా దేవి ప్రబలంగా వ్యాపించి, నవరాత్రి ఉత్సవానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. దుర్గాదేవి శక్తి ఆకృతిలో వ్యక్తీకరించబడిన దేవత. దసహారా అంటే పది రోజులు . ఇది వాడుక భాషలో దసరా అవుతుంది. నవరాత్రి పండుగ అంటే తొమ్మిది రాత్రుల పండుగ, చివరి రోజున అంటే విజయ దశమి నాడు పరాకాష్టకు చేరుకొని 10 రోజుల పండుగ అవుతుంది. ఈ పది రోజులలోను, మహిషాసుర మర్ధిని అయిన దుర్గా మాత అనేక రూపాలను భక్తి శ్రద్ధలతో, ఆరాధనతో పూజిస్తారు.

అంతటి మహోన్నతమైన రోజున మన 'చైతన్యం సంకల్పబలం' ప్రారంభించే అదృష్టాన్ని ఆ దుర్గా దేవి మనకి ఇచ్చింది. మనం మన నరనరాల్లోనూ ఉన్న చెడుని అమ్మని ప్రార్థించడం ద్వారా పవిత్రమవుదామా!

మన 12వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా 'చైతన్యం సంకల్పబలం' పత్రికతో పాటుగా వీడియో పత్రిక ఇంకా 'స్వర రాగ స్రవంతి' అనే పాటల వీడియో కూడా ప్రారంభించాము. మన వీడియో పత్రికలో రచనలు చదువుతున్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు. అలాగే స్వర రాగ స్రవంతి లో పాడుతున్న గాయనీ గాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆదరిస్తున్న పాఠకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు .

## మన దేశం ---- మనం భారతీయులం

గాంధీజీ 153వ జయంతి సందర్భంగా హైదరాబాదులో గాంధీ ఆసుపత్రి ఆవరణలో HMDA ఆధ్వర్యంలో నిర్మించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని లో తెలంగాణా సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణా ప్రాంతంలోనే కాక విదేశాలలో కూడా బతుకమ్మ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పూల పండుగ. తెలంగాణా సంస్కృతీ సాంప్రదాయానికి ప్రతిబింబం.

బతుకమ్మ పాటల్లో చారిత్రకమైన పలు సామాజిక అంశాల పరమార్ధాన్ని తెలియ జేస్తాయి.

ఆంధ్ర ప్రదేశ్ లో విద్య, వైద్య రంగానికి ఆంధ్రప్రదేశ్ CM జగన్ పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్య శాఖా మంత్రి రజని అన్నారు. శనివారం ఆమె పారిశ్రామిక ప్రాంతంలో నిర్మించిన నాలుగు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 528 పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, 1125 ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, పీజీ, మెడికల్ కళాశాలలకు సుమారు 16 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

గాంధీ మహాత్ముడి 153 వ జయంతి సందర్భంగా ఢిల్లీ లోని రాజఘాట్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

## ఇండియాలో కరోనా

గత కొద్దీ రోజులుగా 4 వేల కంటే తక్కువే కొత్త కేసులు నమోదవుతున్నాయని, కేసులు క్రమంగా తగ్గుతూ 37 వేలకు దిగి వచ్చాయని, మన దేశంలో కరోనా వ్యాప్తి పూర్తిగా అదుపులోకి వస్తోందని, కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.

## అమెరికాలో హరికేన్ ----- ఆగని విధ్వంసం

అమెరికాలో హరికేన్ విధ్వంసాన్ని కొనసాగిస్తూనే ఉంటోంది. ఫ్లోరిడాలో Sep ఆఖరి వారంలో హరికేన్ బీభత్సం ధాటికి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఆక్సిజన్ యంత్రాలు పని చేయక ఇద్దరు వృద్ధ దంపతులు మరణించారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండో లో చాలా ప్రాంతాలలో చెట్లు పడి పోవడమే కాక, పవర్ పోవడం, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ళల్లో నీరుతో నిండి పోవడం, ఇంటి ముందు ఉన్న స్విమ్మింగ్ పూల్స్ నిండి పోవడం, ఇంకా ఇళ్ళల్లో పైన రూఫ్ లు లీక్ అవడం ఇలా ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడ్డారు. అయినా ప్రభుత్వం ఆలస్యం చేయక తక్షణ చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇంకా ఒక్క ఫ్లోరిడాలోనే 27 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఫ్లోరిడాలో విధ్వంసం సృష్టించిన తరువాత శుక్రవారం దక్షిణ కరోలినా తీర ప్రాంతంలో తన ప్రతాపం చూపించడం మొదలు పెట్టింది. అక్కడి ఛార్లస్ నగరంలో భారీ వర్షాలు కురిసి పలు ప్రాంతాలు జల-దిగ్బంధం అయ్యాయి. సముద్ర జలాలు పొంగి వీధులను ముంచెత్తాయి. దానికి తోడు భయంకరమైన గాలులు వీచడంతో కొన్ని చోట్ల స్తంభాలు, చెట్లు కూలిపోవడంతో వేల మంది ప్రజలు బిక్కు బిక్కు మంటూ ఇళ్లల్లోనే గడిపారు. ఈ హరికేన్ ధాటికి 30 మంది మరణించారు. ఆ తరువాత దక్షిణ కరోలినా నుండి ఉత్తర కరోలినా వైపు వెళ్లే క్రమంలో బలహీన పడి పోస్ట్ -- ట్రోపికల్ సైక్లోన్ గా మారింది .

మరో వైపు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. విద్యుత్ సౌకర్యం, ఆహార పదార్థాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ హరికేన్ అత్యంత శక్తి వంతమైన వాటిల్లో ఒకటి అని 2004 లో ఇటువంటి హరికేన్ వచ్చిందని, మరల ఇప్పుడు వచ్చిందని అంటున్నారు. ఈ హరికేన్ వల్ల 10 వేల కోట్ల డాలర్ల కు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ఈ విధంగా హరికేన్లు రావడం, అక్కడ ఉన్న మన వాళ్ళు ఈ బాధలు పడడం, ఇక్కడ ఉన్న వాళ్ళ తల్లిదండ్రులు భయ పడడం మామూలే. అయినా ఆశ్చర్యం ఏమిటంటే సొంత వారికి దూరంగా ఉంటూ, ఇటువంటి ఇబ్బందులు పడుతూ కూడా ఆ దేశం వదిలి రావడానికి అక్కడికి వెళ్లిన మనవాళ్ళు ఇష్టపడరు. పైగా మన దేశంలో ఉన్న తల్లి తండ్రులు, అక్కడ ఉన్న పిల్లలు ఒంటరి వారై పోతూ ఉంటే, మన ప్రభుత్వం వెళ్లే వారిని ఆపే దిశగా మంచి మంచి చదువులు ఉద్యోగాలు ఎందుకు కల్పించ లేక పోతోంది? పైగా తెలివైన పిల్లలు వెళ్ళడానికి ఆర్థికంగా సహకరిస్తే, మన దేశ భవిష్యత్తు ఏమైపోతోంది? ఆ దేశాల మీద వారంతా ఎందుకు మొగ్గు చూపిస్తున్నారు? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న.



అసమానతలు చూపిస్తూ, ఓట్ల కోసం నోట్లు చూపిస్తూ, ప్రజ-లకు పథకాల పేరుతొ అన్నీ ఉచితంగా ఇచ్చి ఓట్లు కొనుక్కుంటే, దేశంలో ఈ రోజు ఇచ్చే పథకాలతో ఇప్పుడు మాత్రమే వారి కడుపు నిండుతుంది అనే విషయం అందరూ తెలుసుకోవాలి.

సర్వేజనా: సుఖినో భవంతు

ఎడిటర్

తీగవరపు శాంతి

తీగవరపు శాంతి

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమై నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

**40 వ అధ్యాయం**

**ప్రావరణోత్సవం**

మార్గశీర్ష మాసంలో శుద్ధ షష్ఠిరోజున ప్రావరణోత్సవం నిర్వహిస్తే విష్ణులోకం పొందుతారు.పంచమిరోజు రాత్రి ఉపవాసం ఉండాలి. స్వామికి ఎదురుగా ఉన్న మండపంలోఅష్టదళ పద్మం ముగ్గు వేయాలి. దిక్పాలకులను, క్షేత్రపాలకుని, వినాయకుని, చండుని, ప్రచండుని ఆహ్వానించాలి. (1-4)

ఒక పాత్రను శుభ్రపరిచి, అందులో నీరు పోసి,"ద్యుతానస్తు" అనే మంత్రాన్ని చదువుతు ఒకవస్త్రాన్ని కప్పి ఉంచాలి. ధూపం సమర్పించాక, ఇరవై ఒక్క వస్త్రాలు పరిచి, దానిపై కలశ ఉంచి, పైన ఒక వస్త్రాన్ని కప్పి ఉంచాలి. (5-10)

ఆ కలశంపై చేయి ఉంచి, విష్ణువును స్మరించుకోవాలి."లోకాలన్నివ్యాపించి ఉన్న నారాయణుని కప్పిఉంచిన ఓ వస్త్రమా!నీవు స్వామికి వస్త్రంగా ఉండు అని ప్రార్థించాలి."ఇంద్రఘోష"అను రక్షా మంత్రాన్ని చుట్టూ ఆహ్వానించాలి. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించాక, స్వామిపై కప్పిన వస్త్రాన్ని తొలగించాలి.(11-13)



మిగిలిన దేవతామూర్తులకు ముఖం కనబడుట్లుగా వస్త్రాలను కప్పిఉంచాలి.కర్పూర, నీరాజనం, తాంబూలం సమర్పించాలి. ఈవిధంగా స్వామికి వస్త్రాలు కప్పిన వారికి మోహం ఆవహించదు. చలిబాధను పొందడు. చూచినవారికి కోరికలు తీరుతాయి.బ్రాహ్మణులకు, అనాధలకు కప్పుకోవడానికి వస్త్రదానం చేయాలి. స్వామి అనుగ్రహాన్ని పొందుతారు. (14-19)

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్తమ క్షేత్ర వైభవంలోని ప్రావరణోత్సవం అను నలభైవ అధ్యాయం సమాప్తం.



# నూటపదహార్లు కందాల్లో సుందరకాండ



## (అనుబంధము) పురజన గీత

పాలెపు బుచ్చిరాజు

13) భక్త పరాధీనుండై
ముక్తినొసగి కాచువాడు మోహము వీడన్
శక్తి కొలది పూజించెడు
భక్తులు పిలిచిన పలుకును భగవంతుడిలన్

14) గురుతర మణిహారంబులు
దొరుకగ గురువింద లేర దోసము కాదే
హరిసేవకు దారి తెలియ
తరియించక వమ్ముసేయ తప్పది వినుడీ!

15) శ్రీరాముని వాక్సుధలను
మోరలు పైకెత్తి వినగ మోదము గలిగెన్
పౌరులు కీర్తించి కొలువ
తారకల నడుమ వెలిగెను తానొక శశియై

16) అడిగిన సాయము సేయగ
కడువిధముల మదిని తలచి కాదందురిలన్
అడుగకనె వరములిచ్చెడి
నడవడి గల రాజు దొరికె నౌరా యనగన్

# దక్షిణ కాశి ఆలంపురం ఆలయాలు



మత్స్యరాజ హరగోపాల్




ముఖ్య దైవం బాలబ్రహ్మేశ్వరుడు మందిరం చుట్టూ కోట గోడ ఉంది. క్రీ.శ.762లో విజయాదిత్య సత్యాశ్రయుడు ఇక్కడి మంటపాలను నిర్మించాడు. శివలింగము గ్రైనైట్ రాతిచే నిర్మితమైనట్టిది. ముందు భాగంలో భూదేవి మందిరం ప్రక్కన జోగులాంబా దేవి మందిరం ఉన్నాయి. ఆలంపురంలో ముఖ్య దైవము జోగులాంబ. ఆశ్వీయుజ మాసంలో జోగులాంబాదేవి దినోత్సవ సందర్భంలో యాత్రికులెందరో వస్తుంటారు. ఇక్కడే నవమాతృకలైన బ్రహ్మీకౌమారి వర్ణనీ మలాహీ ఇంద్రాణి, చాముణ్ణి, విఘ్నేశ్వరీ విగ్రహాలు, నవగ్రహ మందిరం ఉన్నాయి. వీటిని ఆనుకునే తుంగభద్రా నది ప్రవహిస్తుంటుంది. శివరాత్రి సందర్భంలో బాలబ్రహ్మేశ్వర ఉత్సవాలు జరుగుతాయి. దేవాలయ ద్వారాలకి ఇరువైపుల బ్రహ్మ, అర్ధనారీశ్వర విగ్రహాలు చెక్కబడినవి. ఆలంపురంలో "ఎల్లమ్మ" ముఖ్యమైన దేవత "నగ్నక బంధం" అనబడే నగ్న స్త్రీ శిల్పం ఇక్కడ మ్యూజియంలోనే భద్రపరచబడి ఉంది. ఈ దేవతను పూజిస్తే స్త్రీలకు సంతానం కల్గుతుందని నమ్మకం. వామమార్గం ప్రబలితమైన కాలంలో ఈ నగ్న స్త్రీ విగ్రహాలు మలచబడియుండవచ్చు. బాలబ్రహ్మేశ్వర ఆలయం ముందు కూడా నగ్న స్త్రీ విగ్రహమొకటి ఉంది.

మన తెలంగాణ రాష్ట్రంలోని ఆలంపురం జోగులాంబ జిల్లాలో చాళుక్య రాజుల కళా విధానంలో నిర్మితమైన ఆలయాలు ఆలంపురాలో తప్ప మరెక్కడ కానరావు. ఇక్కడి ఆలయాల నిర్మాణం విభిన్న రీతుల్లో సాగింది. దేవాలయాల శిఖరాలు ఉత్తర భారతీయ కళా ప్రభావాన్ని సూచిస్తుంటే, దేవాలయాల లోపలి భాగం పశ్చిమ భారతదేశంలోని శిలా నిర్మిత దేవాలయ విధానంలో ఉన్నాయి. దక్షిణ భారత దేవాలయ శిఖరాలకు, ఆలంపుర ఆలయాల శిఖరాలకు

(మిగిలినది వచ్చే సంచికలో)

# భక్త జన సంరక్షణి ఆదిపరాశక్తి



## కొత్త రామానందం



ఓం ఆది పరాశక్త్యై నమ:
భక్త జన సంరక్షణి ఆదిపరాశక్తి
డా ॥ కె . రా మా న ం ద ం

కరుణకు మారుపేరు అమ్మ. భక్తి, ప్రేమ ఎక్కడ ఉంటాయో అమ్మ అక్కడే ఉంటుంది. అమ్మ నిజమైన భక్తిని చూస్తుంది. ఆమెను మన శక్త్యానుసారం ఎలా పూజించినా అమ్మ సంతోషిస్తుంది. మనల్ని అనుగ్రహించడానికి అనేక రూపాలలో సాక్షాత్కరించే ఆ పరాశక్తి సృష్టి, స్థితి, లయ స్వరూపిణి. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అష్ట దిక్పాలకులు సూర్య చంద్రులతో సహా సకల దేవతలు అర్చించే దేవత ఎవరైనా ఉంటే ఆమె ఆ జగత్ జనని మాత్రమే. అమ్మ అండదండలు లేకపోతే బ్రహ్మ సృష్టి చేపట్టలేడు. విష్ణువు సృష్టిని సంరక్షించ లేడు. శివుడు సృష్టిని లయం చేయలేడు. ఇట్టి పరాశక్తిని నవరాత్రి దీక్షతో అర్చిస్తే మహా పాపాలు నశించడమే కాదు సుఖ సంతోషాలు వర్ధిల్లుతాయి. అమ్మవారి రూపాలు, లీలలు అసంఖ్యాకం. ఆ పరాశక్తి దుర్గ, లక్ష్మి, సరస్వతి, కాళీ, చాముండి, లలితా త్రిపురసుందరి, బాలా త్రిపుర సుందరి, రాజరాజేశ్వరి, గాయత్రి, స్వాహా, స్వధా అనేక రూపాలతో దర్శనమిస్తుంది. దేవీనవరాత్రుల పూజలలో ప్రధాన దైవం దుర్గాదేవి అని అందరకు తెలుసు. దుర్గ అంటే కాటు, మహా విఘ్నం, భవబంధం, కర్మం, శోకం, దుఃఖం, నరకం అతి రోగం అనే అర్థములు చెప్పబడ్డాయి. ఎవరు అయితే స్వార్థ పరత్వం, అసూయ, ఈర్ష్య-ద్వేషాలు, కోపావేశాలను అణిచి మానవ కోటిని సక్రమ మార్గంలో నడిపిస్తున్న అమ్మను 'దుర్గా' అని కీర్తిస్తున్నాము.

ఆమె స్త్రీ శక్తికి ప్రతీక. శంభు నిసంబులను అణచడంలో కానీ, మహిషాసురుని అంతమొందించడంలో గాని ఆ తల్లి పురుష సహాయం లేకుండా లోకాలను రక్షిస్తున్నది. ఆమె ఇలా అనేక రూపాలలో దర్శనమిస్తూ భక్తజనకోటిని రక్షించే అమ్మవారి రూపాలలో ఏ రూపాన్నైనా సరే ధ్యానించి స్మరించి అర్చిస్తే ఆమె సంపూర్ణ ఫలాన్నిస్తుంది దేవి భాగవతం ప్రకారం వసంత

రుతువులో వచ్చే చైత్రమాస ప్రారంభం రోజున కానీ, శరదృతువులో వచ్చే ఆశ్వీయుజ మాస ప్రారంభం రోజున కానీ, నవరాత్రులు ప్రారంభిస్తారు. భూలోక వాసులకు వసంత, శరదృతువులు రెండూ కష్ట కాలాలు. ఆ సమయాలలో రోగాలు బాగా వ్యాప్తి చెందుటకు అవకాశం ఉంటుంది. అందుకే ఈ రెండు ఋతువులలో నవరాత్రులు జరపమని పెద్దల నిర్దేశం. అయితే మన భారతీయులు అమ్మలగన్న అమ్మను శరదృతువులో వచ్చే శరన్నవరాత్రులను ఎంచుకొని, భక్తిశ్రద్ధలతో బహు వైభవంగా నిర్వహిస్తారు. శరన్నవరాత్రి పూజలు తిలకించాలి అంటే ఒక్క బెంగాల్‌లోనే చూడాలి. దుర్గాదేవిని బెంగాలీయులు తమ ఆడపడుచు గాను, ఆంధ్రులు తమ మాతృమూర్తిగా భావించి పూజలు నిర్వహిస్తారు. మహారాష్ట్రలో ఈ పండుగను శారద లేక శారదీయ నవరాత్రులుగా అత్యంత శ్రద్ధతో నిర్వహిస్తారు. అమ్మవారు పంచకృత్య పారాయణ అంటే సృష్టి, స్థితి, ప్రళయ తిరోధాన అనుగ్రహాలు చేసే చల్లని తల్లి. ఆమె వేద గణములను సూర్య,చంద్ర భూతములను ప్రకృతి జీవరాశిని సృష్టించే సృష్టి సర్వములో అంతరాత్మగా ఉన్నది. ఆమెయే వారి రక్షణ పోషణ భారము వహించుచున్నది. (స్థితి) కల్పాంతమున మిగులు



పరతత్వముగా లయము జరుపుతున్నది. (సంహారము) కార్యాచరణ మూర్తిగా వారాచరించుచూ పుణ్యకర్మలను బట్టి స్వర్గ సౌఖ్యదులు పాపకర్మలచే ప్రారబ్ధ జన్మలు పొప్పింపచేయుచున్నది. (తిరోదానము) శాశ్వత ఆనంద సుందరాత్మక సత్య స్థానమైన మణిద్వీప మగు పునరావృత్తి రహితమైన ఆమె సానిధ్యమును గ్రహించు మోక్షమిచ్చుచున్నది. (అనుగ్రహం) 'నవరాత్రులు' చేసుకోవడానికి ఒక కారణం ఉన్నది. రాత్రి అంటే చీకటిలో కూడుకుంది. చీకటి నుంచి దేవి ఉపాసన

ద్వారా సవ్యత్వానికి అంటే జ్ఞానం వైపు నడిపిస్తాయి. కాబట్టి నవరాత్రులు చేసుకుంటున్నాం. నవరాత్రులలో రాత్రివేళ దేవి ఆరాధనకు నిషేధం లేదు గురువు ఉపదేశం పొందినవారు పూజలు నిర్వహించవచ్చును. నవరాత్రి ఉత్సవాలను ఆశ్వీయుజ శుక్ల పాడ్యమి నుంచి నవమి వరకు చేయుట ఆచారం అలా చేయుటకు శక్తి లేకపోతే తదియ నుంచో పంచమి నుంచో సప్తమి నుంచో చివరకు నవమి నాడు ఒక్కరోజైనా చేయాలి. కొందరు ఈ రోజులలో ప్రతి దినం కుమారి పూజ, సుహాసిని పూజ కూడా చేస్తారు మన ఆంధ్రరాష్ట్రాలలో మొదటి మూడు రోజులు దుర్గా పూజ ద్వారా అరిషడ్వర్గాలను అంతరింప చేసుకొని తరువాత మూడు రోజులు లక్ష్మీ పూజ ద్వారా సుగుణ సంపదలను పొంది చివరి మూడు రోజులు సరస్వతీ పూజ ద్వారా జ్ఞానం లభిస్తుంది అని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానం. తల్లి జగత్ కల్పవల్లి ఏ పేరున పిలిచినా పలుకుతుంది. శక్తి విజయ స్వరూపిణి అయిన శమీ వృక్షాన్ని కూడా పూజిస్తారు. శమీ వృక్షం (జమ్మి చెట్టు) వల్లనే ఈ పుణ్య కాలాన్ని విజయదశమి అన్నారు శమీ విజయాన్ని అందిస్తుంది కనుక విజయదద అన్నారు. అందుకే విజయదశమి అని అన్నారు. ఈ శుద్ధ దశమి సర్వ కామ్యార్థ సాధకమైనవి. ఈ దశమినాడు శ్రవణా నక్షత్రం ఉండాలని జ్యోతిశ్శాస్త్ర నియమం. అమ్మవారు లేక ఆమె కృపతో దేవతలు ఈ తొమ్మిది రోజులలో అనేక అసురులను ఓడిరచారు అప్పటి నుంచి ఇవి నవరాత్రులు అయినవి. ఆ తల్లి దుష్టశిక్షణ శిష్ట రక్షణ గావించింది. కావున శరన్నవరాత్రులు సమయమందు తల్లి పాదాలనే శరణని వినమ్రంగా నమస్కరించి తమ అభీష్టాలను తెలుపుకుంటారు. విజ్ఞతతో, వివేకంతో అంతర్ ఇంద్రియాలను జాగృతం చేసి ఆత్మ అన్వేషణతో పరాశక్తి ప్రజ్ఞలని పరిపూర్ణముగా ఆకళింపు చేసుకుంటూ అమ్మను నమస్కరిస్తే ఆమె ప్రసన్నురాలై మార్గాన్ని సుగమం చేస్తుంది.

దుర్గగా ఆవిర్భవించి దుర్గముడు అని అసురుణ్ని సంహరించేందుకు సమస్త లోకవాసులు వినతితో సమాయత్తమైంది. ఈ దుర్గముడు బ్రహ్మదేవుడు వల్ల వరములు పొంది వరగర్వంతో సమస్త లోక వాసులను హింసించసాగాడు. అతడు చతుర్వేదాలను అపహరించాడు అందువల్ల ధర్మ క్రియలు ఆగిపోయాయి. నదీనదాలు ఎండి కరువు కాటకాలు ఏర్పడ్డాయి. దుర్గాదేవి తన త్రిశూలంతో దుర్గమాసురుణ్ని సంహరించి వేదాలను ఉద్ధరించి దేవతలకు ప్రసాదించింది. ఆదిశక్తి యొక్క మరో రూపం మహాలక్ష్మి మహిషాసురుడనే రాక్షసుని సంహరించిన శక్తి మహాలక్ష్మి. మహిషుణ్ణి సంహరించేందుకు సమస్త దేవతల శరీరాల నుండి మహా దివ్య తేజస్సులు బయటకువచ్చి ఒక మహోజ్వల తేజోరూపంలో ఆవిర్భవించింది మహాలక్ష్మి. ఆమె ఎర్రని కాంతులతో ప్రకాశించే మహాలక్ష్మి పద్మాసన, అష్ట భుజాలతో ప్రకాశించే తల్లి. ఆ భుజాలతో అక్షమాల పరశవు, గద, బాణం, వజ్రాయుధం, పద్మం, ధనస్సు, వరమాల, దండం, శక్తి, ఖడ్గం, చర్మం, జలజం, గంట, పానపాత్ర, శూలం, పాశం, సుదర్శనం మొదలైన ఆయుధాలతో దర్శనమిస్తుంది. శక్తి రూపాలలో మొదటి రూపం మహాకాళి. ఈ తల్లి విష్ణువు యోగనిద్ర స్వరూపిణి. ఒకసారి విష్ణువు యోగ నిద్రలో ఉండగా మధు కైటబులు అనే రాక్షసులు బ్రహ్మపై దాడి చేసినప్పుడు బ్రహ్మ యోగనిద్రా దేవిని స్తోత్రం చేశాడు. ఆ యోగనిద్రే మహాకాళి. పరాశక్తి తన దివ్య రూపంలో బ్రహ్మ ముందు ప్రత్యక్షమై విష్ణువును నిద్రా విముక్తుణ్ణి చేసింది. ఆ మహాకాళి అనంత మహిమ వలన బ్రహ్మ వస్తుడవగ విష్ణువు మధు కైటబుల్ని సంహరించాడు. శంబు, నిశంభులనే రాక్షసుల్ని సంహరించిన మహాశక్తి సరస్వతి. దేవతలు, ఋషుల స్తోత్రంతో సకల లోకాలను రక్షించే

గౌరీ దేవి శరీరం నుండి వచ్చిన దివ్య రూపం సరస్వతి దేవి. ఈ తల్లే రాక్షస సంహారం కావించి శాంతిని ప్రతిష్టించింది ఆమె వెన్నెల వంటి తెల్లని కాంతులతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ తల్లి అష్ట భుజాలలో, ఘంట, శూలం, వాలం, శంఖం, ముసలం, చక్రం, ధనస్సు, బాణాలతో దర్శనమిస్తుంది. ఆమె వాహనం హంస. పాలను, నీళ్లను వేరు చేయగల శక్తి ఒక్క హంస కే ఉందని చెబుతారు. అంటే ప్రపంచంలో నవ్విస్తూ అయినా జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని అర్థం. ఆమె నాద రూపిని. ఆమె దేహం తెల్లని రంగు పరిపూర్ణ పరిశుద్ధ తత్వానికి ప్రశాంతత గుర్తు. తెలుపు అన్ని వర్ణాల సమిష్టి రూపం. సరస్వతి సకల విద్యా సమిష్టి మూర్తి. మన ఆలయాల్లో ఈ నవరాత్రులు పది రోజులు అమ్మవారిని చక్కగా అలంకరిస్తారు. పూల మధ్య నగలతో పసుపు, కుంకుమలతో నూతన పట్టువస్త్రాలతో అమ్మ దర్శనమిస్తారు. మొదటి రోజున దేవి బాలా త్రిపుర సుందరిగా నూతన పట్టు వస్త్రాలతో దర్శనమిస్తుంది. మహాలక్ష్మి రూపంలో రెండో రోజున రెండు ఏనుగులు అభిషేకం చేస్తున్నట్లుగా ధనంతో ఘటాలతో కుమ్మరిస్తున్నట్లుగా అలంకరింప బడుతుంది. పది చేతులు, పది ఆయుధాలు, ఐదు ముఖాలతో, నాలుగు వేదములు తల్లిగా, శుద్ధ స్ఫటికంలాగా పద్మాన్ని చేత ధరించి గాయత్రీ మాత అలంకారాన్ని మూడవ రోజున పూజారులు అమ్మని తీర్చిదిద్దుతారు. ఇక నాలుగవరోజు అన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిస్తుంది. ఆమె చేతులలో వరద అభయ హస్తాలు కాక వంట పాత్ర వడ్డించే గరిటె కానవస్తాయి. అయిదవ రోజున భక్తులకు సరస్వతి మాతగా ఒక చేత వీణ, వేరొక చేత చరకా, మరొక చేతిలో పుస్తకం ఇంకో చేతిలో అక్షరమాలతో మనను ఆశీర్వదిస్తూ దర్శనమిస్తుంది. ఆరో రోజున శ్రీ లలితా త్రిపుర సుందరిగా ఒక చేత అభయమిస్తూ వేరే చేతిలో ధనుస్సును పట్టుకుని శోభిస్తుంది. ఏడవ రోజున కాళికారూపంలో నాలుకను బయటకు తెరచి చూపుతూ రౌద్రాన్ని ప్రదర్శిస్తుంది. దుర్గాదేవి అవతారాన్ని ఎనిమిదవ రోజు ఆలయాల్లో దర్శింప చేస్తారు. పులి మీద ఆసీనురాలై శంఖ చక్రాలను, పద్మాన్ని, ధనుర్బాణాలు ధరించి సర్వులను చేసే స్వభావం కలదిగా కానవస్తుంది. ఈ రోజును మహాష్టమి అని కూడా అంటారు. ఈ రోజంతా అష్టమి తిథి ఉంటే అది దుర్గాష్టమి. అష్టమి వెళ్లి ఆ రోజంతా నవమి తిథి వస్తే దానిని మహాష్టమి అంటారు. సంతానం కోరువారు ఈ రోజున దుర్గా దేవిని సహస్ర నామాలతో కుంకుమార్చన చేస్తే ఫలితముంటుందని చెబుతారు. అలాగే లలితా సహస్రనామ పారాయణం కూడా ముఖ్యం. తొమ్మిదవ రోజు అలంకారం మహిషాసురమర్దని అవతారం. దున్నపోతు స్వభావం అయిన మహిషాసురుడు కామక్రోధాలు అజ్ఞాన అహంకారాలు హద్దు మీరిన మహిషాసురుని సంహరించింది. అమ్మను 'జయ జయహే మహిషాసుర మర్దిని రమ్యకపర్దిని శైలసుతే'. అనే మకుటంతో భక్తులు స్తుతిస్తారు. ఆరోజున పూజానంతరం దేవికి పేలాలను నైవేద్యం పెడతారు ఆయుధ పూజ ఈరోజు ప్రత్యేకత ఈరోజు తమ పుస్తకాలు విద్యా సామాగ్రిని దేవి ముందు నుంచి విద్యార్థులు దేవిని పూజిస్తారు. ఈ శుభదినాన వివిధ వృత్తులవారు వివిధ సాధనాలను, వాహనాలను పూజించుకుంటారు. ఈ విజయదశమి నాటి అమ్మవారి అలంకారం రాజరాజేశ్వరి. ఆమె పరమశాంత స్వరూపంతో చిరునవ్వును చిందిస్తూ... చెరుకుగడను చేతిలో ధరించి అభయ ముద్రతో దర్శనమిస్తుంది. 'విజయదశమి' విజయాన్ని సంకేతంగా భావిస్తారు. ఈ రోజున శ్రీరాముడు రావణుని సంహరించాడని విశ్వాసం. అర్జునుడు జమ్మి చెట్టుపై దాచిన ఆయుధాలు తీయించి కౌరవ వీరులను ఓడిరచాడని మహాభారత విరాటపర్వంలో వ్రాయబడిరది. విజయదశమి నాడు

శమీ పూజ చేస్తారు. శమీ అంటే జమ్మి. జమ్మి చెట్టును ఈ రోజు పూజించాలి. పాండవులు అజ్ఞాతవాసంలో తమ ఆయుధాలను జమ్మి చెట్టు పై ఉంచారు. శమికి పాపాలను నశింపజేసే శక్తి, శత్రువులను సంహరించే శక్తి ఉన్నాయని నమ్మకం.

**"శమీ శమీయతే పాపం, శమీ శత్రు వినాశినీ అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శన:"**

జమ్మి ఆకును తమ శ్రేయోభిలాషులకిచ్చి వారిని ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు అందజేసి అవతలి వారి అభిమానాన్ని చూరగొనడం ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక ఆనవాయితీ. శమీ పూజ నాడు అపరాజితాదేవిని పూజిస్తారు. ఆ తర్వాత పొలిమేర దాటి సిమెల్లంగణం రాజులు చేసేవారట. పూర్వం రాజులు అపరాజితాదేవిని పూజించిన తర్వాతనే పట్టాభిషేకం చేసుకునేవారట. బెంగాల్ ప్రజలు షష్ఠి తిథి నాడు దుర్గా పూజను ప్రారంభిస్తారు. సప్తమినాడు బోధక్ అనే ప్రాణ ప్రతిష్ఠ ప్రక్రియ ద్వారా దేవి విగ్రహాలకు చైతన్యం కలిగిస్తారు. కొలాబొ అనే ఒక ప్రత్యేక జాతికి చెందిన అరటిపిలకలు అమ్మవారికి సింగారించి పసుపు చీరను అలంకరిస్తారు. ఈ తంతులోని అరటి పిలక ఎవరో కాదట పార్వతి దేవి పెద్ద కోడలైన సిద్ధీదేవట. అష్టమి, నవమి తిథుల సంధికాలంలో సంధి పూజలు చేస్తారు. అమ్మవారిని తమ ఆడపడుచుగా భావించి ఆమెను సకల మర్యాదలతో ఆహ్వానించి పూజలు జరిపి అంతే గౌరవప్రదంగా నిమజ్జనం అనే ప్రక్రియ ద్వారా సాగనంపుతారు. బెంగాలీలు అంగరంగ వైభవంగా భక్తితో అమ్మను సేవిస్తారు. ఆమె అనుగ్రహానికి పాత్రులు అవుతారు. భాగ్యనగరంలో బెంగాలీలు నిర్వహించే కార్యక్రమాలలో ఆంధ్రులు ఎక్కువ సంఖ్యలో హాజరయి అమ్మవారికి ఇచ్చే హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. తెలంగాణలో బతుకమ్మ పేర దసరా ఉత్సవాలను అమితోత్సాహంగా జరుపుకుంటారు. బ్రతుకులు ప్రసాదించే అమ్మ బతుకమ్మ ఇందులో ప్రధానమైనది గౌరీ పూజ. బతుకమ్మ అనే ఆడపడుచు పేరు మీదుగా ఈ పండుగ నిర్వహిస్తారు. భాద్రపద అమావాస్య నుండి ఆశ్వయుజశుద్ధ అష్టమి వరకు ప్రతిరోజు చీకటి పడిన పిదప బతుకమ్మను పూజించి వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడుకుంటారు. తొమ్మిదో రోజున జలాశయాలలో నిమజ్జనం చేస్తారు. మైసూర్ చాముండేశ్వరి ఆలయం, విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయం, మధురలోని మీనాక్షి ఆలయాల్లో దసరా ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. వేలాది సంఖ్యలో దసరా నవరాత్రుల ఉత్సవాలను కుంకుమ పూజలను తిలకిస్తారు. ఈ ఆలయాల్లో అమ్మవారికి రోజుకు ఒక అలంకరణ కావించి తమ భక్తిని చాటుకుంటారు. ఇక ఢిల్లీ రాజధాని నగరంలో దసరా పండుగ రోజున రామలీలా ఉత్సవాలు జరుగుతాయి. పదవ రోజున జరిగే రావణ సంహార ఉత్సవం తిలకించేందుకు వేలాది ప్రజలు వస్తారు. ఈ శరన్నవరాత్రులలో రంగులు చల్లుకోవడం, పగటివేషగాళ్ళు బండి దేవుళ్ళు, కోలాటాలు, బొమ్మల కొలువులు, బడి పిల్లల వారి పంతుళ్ళు వీధుల్లో ఊరేగే ముచ్చటైన దృశ్యాలు తిలకించే అవకాశం లభిస్తుంది. భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన తిరుమల క్షేత్రంలో కొలువుతీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవం ఈ దసరా నవరాత్రులు సమయంలోనే అంగరంగ వైభవంగా నిర్వహింపబడతాయి. రోజూ లక్షలాది భక్తులు ఉత్సవాలను తిలకించుటకు విచ్చేస్తారు.

**సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే!**
**శరణ్యే త్రయంబకే దేవి నారాయణి నమోస్తుతే!!**

# హితోక్తులు

**దర్శనే స్పర్శనే వాపి భూషణే భావనే తథా!**
**యత్ర ద్రవత్యం తరంగం సస్నేహ: ఇది కద్యతే!!**

ఎవరినైతే చూసినపుడు కానీ స్మరించినప్పుడు కానీ, మాట్లాడినప్పుడు కానీ, మనసులో భావించినప్పుడు కానీ, మనసు ఆహ్లాదంతో, ఆనందంతో, ఆత్మీయతతో, ఆర్ద్రతతో ద్రవి-స్తుందో దానినే స్నేహం అంటారు.

**వార్ధక్యం వయసానాస్తి మనసా నైవ తద్భవేత్!**
**సంతతోద్యమ శీలస్య నాస్తి వార్ధక్య పీడనం !!**

ముసలితనం వయసులో లేదు వయసుతో రాదు. మనసులోనూ ఉండకూడదు. ఎప్పుడూ పని చేసేవానికి ముసలితనపు పీడ ఉండదని సుభాషితం. ముసలితనం రెండు విధాలుగా వస్తుంది. వయోభారంతో వచ్చేది శారీరకం. దుఃఖం వల్ల వచ్చేది భావజం. వయోభారం వల్ల వచ్చేది కూడా ఆపాదించబడిన ముసలితనమే.

**యో పాయావవో మామ తేయంతే అగ్నే పశ్యంతో అందం దు-**
**రిదాదరక్షన్**
**ర రక్ష తాస్తు కృతో విశ్వ వేదాది ప్సన్త ఇద్ధ్రి పవో నాహదేభు: !!**

పరోపకార పరమార్ధ కార్యములలో నిందా, నిషేధము, హేళనలు, భయమనకు తావివ్వరా-దు. అటువంటి మనుషులను పరమాత్మయే స్వయంగా రక్షిస్తాడు. అందువలన నిశ్చింతుడవై కళ్యాణ కార్యాలలో నిమగ్నం కావాలి.

# బాలసాహిత్యభగీరథుడు
# డా.పత్తిపాక మోహన్



తుమ్మూరి రాంమోహనరావు

"భలే తాత మనబాపూజీ
బాలల తాతా బాపూజీ
కులమత భేదంవలదన్నాడు
కలిసిబతికితే బలమన్నాడూ "

(గత సంచిక తరువాయి)

చిన్నవాడైనా మా తెలుగ సాహితీ సదస్సుకు వెలుగు బాటచూపినందుకు కృతజ్ఞుణ్ని. నా లాంటి వారు ఎందరోఆత్మీయులున్నారు ఈ రెండుతెలుగు రాష్ట్రాల్లో.అందుకే ఆయన అచిర కాలంలోనే లబ్ధ ప్రతిష్ఠుడై అనేక సాహితీ సమావేశాల్లో వక్తగా, వ్యాఖ్యాతగా,అతిథిగా-,అధ్యక్షునిగా ఆహ్వానాలందుకుంటున్నారు.

ఇక కేంద్ర సాహిత్యఅకాడమీ పురస్కారం పొందిన 'బాలల తాతా బాపూజీ' గేయరూపంలో గాంధీజీ జీవిత చరిత్ర.మహాత్మా గాంధీ 150 వ జయంతి సందర్భంగాబాలలకు కానుకగా వెలువరించిన పుస్తకం ఇది.

దీనిని ఇటీవలే ఆకస్మిక మృతి చెందిన ప్రముఖ సాహితీవేత్త, సౌజన్య మూర్తి,అనువాదకులు పత్తిపాక స్వగ్రామం సిరిసిల్లాకు చెందిన నిజాం వెంకటేశంగారికి-అంకితమివ్వడం జరిగింది.

పన్నెండేళ్లు దాటిన బాలబాలికలు తమకు తామే చదువుకుని పాడుకునే విధంగామాత్రాచ్ఛందస్సులో రూపొందించారు మోహన్ గారు.రెండు భాగాలుగా ఉన్న బాలల తాతా బాపూజీ,మొదటి భాగ మంతా గాంధీ స్ఫూర్తితో రాసిన బాల



గేయాలు కాగా,రెండవ భాగమంతా గాంధీజీ జీవితం లోని ముఖ్యమైన సంఘటలను గుదిగుచ్చి పిల్లలకు గాంధీ కథనుగేయరూపకంగా అందించారు.

మచ్చుకు మొదటి భాగంలో,

"జోతలివేఅందుకొనుము
గాంధీతాతా!
భరతజాతికంతటికీ స్ఫూర్తి
ప్రదాతా
శిరమెత్తిన స్వేచ్ఛకు నీ
పిలక ప్రతీక
నీ బోసినవ్వే కద భరతజాతి
జ్ఞాపిక "

గేయాలు గాంధీ గారి గొప్పతనాన్ని పిల్లలకు అర్థమయ్యే రీతిలోఅలతి పదాలతో రాసారుమోహన్.

రెండవ భాగమైన గాంధీ జీవిత చరిత్ర ఇలా మొదల-

వుతుంది.

"వాయువ్యపు భారతాన
ఉదయించెను భానుడు
భరతజాతికే పితగా
వెలిగిన అసమానుడుః

అలా బాల్యం, యౌవనం,చదువు, ఉద్యోగం ఆ తరువాత దక్షిణాఫ్రికా అనుభవాలు,తిరిగి భరతభూమికి వచ్చిన తరువాత స్వాతంత్ర్య సముపార్జనకై నడుంబిగించి తెల్లదొరలనెదించడానికి సత్యాగ్రహాన్ని ఆయుధంగాచేసుకుని అహింసాయుత మార్గంలో చేపట్టిన దండి ఉప్పు సత్యాగ్రహం,విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణోద్యమం,చరఖా పై నూలువడకటం, సబర్మతీ ఆశ్రమం,రౌండు టేబులుసమావేశం,మొదలైన సంఘటనలనుసరళమైన పదబంధాలతో సాగుతుంది.ఉదాహరణకు,

"సత్యాగ్రహదీక్షనే
అతని చేతి ఆయుధం
నల్లజాతి ఉద్యమాని
కుడే ఒక పతాకం"

"కదలు రాట్నం రెండూ
కదిలితేనె స్వర్గం
మనుషులంత ఒక్కటిగా

మెలిగితేనె విజయం"

"ఉద్యమమే గాంధిగా
గాంధీయే ఉద్యమంగ
దేశమంతకదిలింది
అడుగుఅడుగు కదిపింది"

పుస్తకానికి కూరెళ్ల శ్రీనివాస్ సందర్భోచితమైన బొమ్మలు పిల్లలను ఆకర్షించేవిధంగా సమకూర్చారు.

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుని గురించి నేటి తరం బాలలకుతెలియజెప్పాలనే సంకల్పానికి సరియైన గుర్తింపు కేంద్ర సాహిత్య పురస్కారంరావడం.ఈ పురస్కారాన్ని వచ్చే నెల నవంబరు 14 చాచాజీ పుట్టిన రోజు బాలలదినోత్సవ సందర్భంగా స్వీకరించబోవడం మరో విశేషం.

బాల సాహిత్యాన్ని ముందుకు నడిపించే దశలో డా.పత్తిపాక



మోహన్ స్వీయకవిత్వంగా ,పిల్లల కోసం మన కవులు,చందమామ రావే,వెన్నముద్దలు,ఆకుపచ్చని పాట,ఒక్కేసి పువ్వేసి చందమామా-,జయహో బాల సాహిత్యం, పిల్లల కోసం సినారె కథ,మూడు పిల్లుల కథలు వంటివి వెలువరించారు.

ఇవి కాకుండా బంతిపూలు (కవిత్వం),తెగిన పోగు(తొలి చేనేత దీర్ఘ కవిత), పచ్చబొట్టు (నానీలు),కఫన్ (చేనేత నానీలు),లాక్డౌన్ (కోవిడ్ 19 కవితా సంపుటిమరియు మన కవులు పోటీ పరీక్షల కోసం రాసిన కవుల చరిత్ర .

బాలసాహిత్యాభివృద్ధి క్రమంలో అనేకసంకలనాలు వెలువరించడమే గాక, దాదాపు ముప్పై ఇతర భాషల నుండి బాలల పుస్తకాలు అనువాదం చేయడంజరిగింది. డా. మోహన్సంపాదకత్వంలో పలు సంచికలు, సావనీర్లు వచ్చాయి. అలాగేఅనేక పత్రికల్లో బాలసాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు,-సాహిత్య వ్యాసాలుచాలానే ఉన్నాయి.

పిల్లల పాఠ్య పుస్తకాలకు సంపాదకులుగా నియమించబడటం, కొన్ని రచనలనుపాఠ్యపుస్తకాలలో చేర్చడం ఈయన బాలసాహిత్య కృషికి గుర్తింపుకు ఒకనిదర్శనం. ఈయన కొన్ని పుస్తకాలు ఇతర భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి.



ఇంతటి ప్రతిభాశాలిని వరించిన పురస్కారాలు కూడా తక్కువేమీ కాదు. అందులో బాలసాహిత్య పరంగావచ్చినవి కొన్నైతే,ఇతర పురస్కారాలు మరి కొన్ని.

'బాలసాహిత్య పురస్కారం' పేరుతో తెలుగు విశ్వ విద్యాలయం, డా.నన్నపనేనిమంగాదేవి,డా.చింతోజు బ్రహ్మయ్య-బాలమణి, డా.వేదగిరి రాంబాబు,బాలనేస్తం ,శ్రీమతి శకుంతలా జైనీ స్మారక,'బాలబంధు' సమతారావు,శ్రీమతి మంచిపల్లి సత్యవతిజాతీయ,ప్రజాకవి కాళోజీ పేరుల మీదుగాలభించాయి.

ఇతర పురస్కారాల జాబితా చాలా పెద్దది.దాదాపు మూడు పదుల పురస్కారాలుపలు సంస్థలనుండి వీరికిలభించాయి. అందులో ఆంధ్రప్రదేశ్ తొలి యువపురస్కారం1997 లో జాతీయ యువజనోత్సవా లలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా-అందుకున్నారు. అలాగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా సాహిత్యపురస్కారాన్ని రాజన్న సిరిసిల్లా ప్రశాసనం నుండి కేటీఆర్ చేతుల మీదుగా2017 తీసుకున్నారు.2009 లో తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారం పొం-

దటంజరిగింది.వ్యాస విస్తర భీతితో మిగిలిన పురస్కారాల వివరాలను తెలుపలేక పోతున్నాను.

ఉద్యోగం, సద్యోగం రెండూ ఒకటైన వారికి కొన్ని అదనపు అవకాశాలు లభిస్తాయి. ఈయన నేషనల్ బుక్ ట్రస్టులో తెలుగు విభాగం సహాయ సంపాదకునిగా-పనిచేస్తుండటంతో దేశ విదేశాలకు పర్యటించే అవకాశాలు దొరికాయి. అలా 'బ్యాంకాక్ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్', శ్రీలంక అంతర్జాతీయ పుస్తక మేళా, గౌడలహరఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్, మెక్సికో,పట్టాంబి పోయెట్రీ ఫెస్టివల్ & వర్క్ షాప్, కేరళ, అయ్యప్ప ఫణిక్కర్ పోయెట్రీ ఫెస్టివల్, తిరువనంతపురం వంటివి ఉన్నాయి. ఇవికాక జాతీయకవిసమ్మేళనాలు, బాల సాహిత్య సదస్సులు, కార్యశాలల నిర్వహణ గురించి రాస్తూ పోతేచిన్నపాటి పుస్తకమే అవుతుంది.

ప్రతిభావంతుడైన డా. పత్తిపాక మోహన్ వయసులోచిన్న వాడైనా పలు ప్రతిష్టాత్మకసమావేశాలకు వ్యాఖ్యాతగా, ముఖ్య అతిథిగా, అధ్యక్షునిగాఆదరింపబడుతున్నాడు.

జనవరి 5, 1972 లో నాటి కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం లింగంపేట మాతామహుల ఇంటిలో జన్మించారు.ఈ ఊరికి కోసెడు దూరంలోనే జ్ఞానపీఠ పు-



రస్కారగ్రహీత డా. సి.నారాయణ రెడ్డి పుట్టిన హనుమాజీ పేట ఉంది. తలిదండ్రులు సిరిసిల్లకు చెందిన శ్రీమతి గంగా బాయి-శ్రీ లక్ష్మీరాజం గారలు.చేనేత కుటుంబంలో పుట్టి పెరిగి బాల్యం నుండి ఆవృత్తి-పరిసరాల నేపథ్యం బాగా ఆకళింపు చేసుకున్నారు. పితామహులు,అచలయోగిబ్రహ్మశ్రీ పత్తిపాక శంకరయ్య గారు మోహన్ గారికి తొలి గురువులు కావడంతో ఆయన ప్రభావం ఈయనపై బాగా ఉంది.

సహజంగా అత్యంత స్నేహశీలి కావడం,చొచ్చుకు పోయే నైజం, అందరితోకలివిడిగా ఉండటం, అన్నిటికంటే మించి అహంకార రహితుడు కావడం ఆయనకు అసంఖ్యాక మిత్రుల్ని కలిగేట్టు చేసాయి.పరిచయమైన ప్రతివారితోనూ ఆత్మీయంగాఉంటూ వారికి వలసిన హితవులందిస్తూ పెద్దవారి నుండి చిన్నవారి దాకా ఆదరణపాత్రుడయ్యాడు. డా. పత్తిపాక మోహన్ ఇలాగే ఇంకా ఎన్నో పురస్కారాలు పొంది,ఇతోధిక బాలసాహిత్య సేవ చేస్తూ,ఇంకా ఎన్నో కీర్తిశిఖరాలనధిరోహించాలని మనసారాకోరుకుంటున్నాను.

# శ్రీ వచన భూషణం



13.ఉపదేశత్తాలే మీళాతపోతు, చేతననై యరుళాలే తరుత్తుమ్ ఈశ్వరనై యడకాలే తిరుత్తుమ్. అర్థం:-జీవుడు , ఈశ్వరులలో తన ఉపదేశం వల్ల ప్రయోజనం కనిపించక పోతే జీవుని తన కృపచేత పరమాత్మ కు తన సౌందర్యం చూపి దిద్దుబాటు చేస్తుంది. వివరంగా:-జీవుడు ప్రకృతి మాయ ఆకర్షణకు లోనై ఈ సృష్టిలో గల ప్రతీ వస్తువు నాసొంతం. ఈభూమి పై నన్ను అడ్డగించేశక్తి ఎవ్వరికీ లేదు అని అహంకరిస్తూ ఉంటారు.కొందరికి ధైర్యం సరిపోక అధర్మంగా ప్రవర్తించే ,ఇలాంటి వారిని కీర్తిస్తూ వారి సేవలు చేస్తూ అనుసరిస్తూ ఉంటారు.అట్టి వారిని సైతం పరమాత్మ అనుగ్రహం పొందే విధంగా అమ్మ ప్రయత్నిస్తుంది. ఉదా:-రామచంద్రుని భార్య సీతమ్మను రావణుడు లంకలో బంధించి తనకు లొంగిపొమ్మని ఐశ్వర్యము వంటి భోగభాగ్యాలు ఆశచూపగా....... సీతమ్మ రావణునితో నేను శ్రీరామచంద్రుని ధర్మపత్నిని. సూర్యుని నుండి కాంతి ఏవిదంగా వేరుచేయలేరో అదేవిధంగా నాభర్త నుండి నన్నూ వేరు చేయలేరు.నా రామచంద్రుడు ప్రస్తుతం రాజ్యం, ఐశ్వర్యము భోగభాగ్యాలు లేనివాడు కావచ్చు ఏదియేమైనా అతడు నాభర్త. నీవు రాజువుగాన నీభార్య పాతివ్రత్య ధర్మాన్ని నీవు ఎలా రక్షించాలను కుంటావో అలాగే ఇతర స్త్రీల పాతివ్రత్య ధర్మాన్ని రక్షించాలి.నీమాట నీదే తప్ప పెద్దలును ఆశ్రయించడం నీకు తెలియదు. సహజంగా ఎవరికైనా ధర్మసందేహం కలిగితే "తద్విద్ధ ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానినః తత్త్వ దర్శిన"ధర్మతత్త్వం తెలిసిన పెద్దల చెంతకు వెళ్లి వారికి నమస్కరించి నీకు తెలియని ధర్మవిషయములు అడిగితే వారు ఉపదేశిస్తారు.నీవు అడుగవు. ఒక వేళ నీమేలు కోరేవారు నీకు హితం



చెప్పినా నీవు వినవు. ఒకత్రాగుబోతు నడిపేవాహనం లో ప్రయాణించాలని భావించేవారంతా ప్రమాదం కొని తెచ్చిపెట్టుకున్న ట్లే నిన్ను ఆశ్రయించిన వారి జీవితం ఉంటుంది.నీవు మంచి చేస్తేఈలోకంలో నీకీర్తి ఎంతవరకూ ఉంటుందో అంతవరకూ స్వర్గం లో ఉంటావు.పాపంచేస్తే నరకంలో ఉంటావు.ధర్మంగాననడుచుకోమని సీతమ్మ హితబోధ చేస్తే...రావణుడు మేము రాక్షసులం. అధర్మంగా నడుచుకోవడం మే మాధర్మం అన్నాడు.సీతమ్మ కళ్ళ వెంబడి నీళ్ళు పెట్టుకుంది తప్ప మాట్లాడలేక పోయింది.

. హనుమ లంక చేరి సీతమ్మను దర్శించి రావణుని చెంత చేరి హితబోధ చేయగా హనుమతోకకు నిప్పు పెట్టమని ఆదేశించగాభటులు తోకకు నిప్పుపెట్టడం జరింగింది.హనుమ తోకకు అగ్ని బాధ లేకుండా సీతలం కలిగించాలని సీతమ్మ అగ్ని దేవుని ఆదేశించింది.ఆశ్చర్యం అగ్ని హనుమను ఏమీ చేయలేదు సీతమ్మకు అన్ని శక్తులు ఉండీ వాడు పెట్టే నా నా బాధలు అనుభవించింది. "దగ్ధోభవ" అంటేచాలు నశించిపోయేవాడు.కాని ఆమె తనకు అపకారం చేసిన వారినైనా రక్షిం చాలానే దయాగుణం కలది.

సీతమ్మ విషయంలో రావణుని కన్నా ఎక్కువ నేరం చేసిన వాడు కాకాసురుడు., రామచంద్రుడు అతనిని శిక్షించే విధంగా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా కాకాసురుడు శరణుఅన్నాడు గాన రక్షించమని సీతమ్మ రామచంద్రుని తో పట్టుబట్టి మరీ ప్రాణాపాయం లేకుండా తన కృపా గుణం ప్రదర్శించింది.

రావణుని మరణానంతరం సీతమ్మను బాధించిన రాక్షస స్త్రీలను హనుమ శిక్షిస్తా అంటే అడ్డగించి రక్షణ కల్పించింది ఈవిధంగా జీవులపట్ల తనకృపాగుణాన్ని ప్రదర్శించింది.

ఇక పరమాత్మ విషయంలో అమ్మ ఈశ్వరునికి తన సౌందర్యం చూపిజీవులపట్ల జాలికలిగే విధంగా ప్రయత్నిస్తుందట. స్వామికి నచ్చిన చీర,పువ్వులు ఆభరణాలు ధరించి జీవుడి పట్ల స్వామి కి కోపం తగ్గేవిధంగా .చేయాలన్న ప్రయత్నం లో భాగంగా ఇప్పుడు నేను ఎలా ఉన్నాను అంటుందట.స్వామి జీవుని పట్ల కోపం తో తలతిప్పేసుకుంటే . కన్నీటితో అమ్మ మీరు వాడిని శిక్షించాలని నిశ్చయానికి వచ్చారు. వాడికి మీరు వేసే శిక్షలు భరించలేడు.ఆశిక్ష ఏదో నాకు వెయ్యండి నేనే భరిస్తా.అంటూ దుఃఖిస్తుంటే బిడ్డపట్ల వాత్సల్యంతో కూడిన అమ్మ వారి సహజ సౌందర్యం చూసి ఆమెవశం అవుతారట. ఆవిధంగా ఈశ్వరుని దిద్దుబాటు చేస్తుంది.


చైతన్యం సంకల్ప బలం
అక్టోబర్ 2011
సామాజిక విలువల మాస పత్రిక
వెల: రూ.10/-
ప్రారంభ సంచిక ముఖచిత్రం
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలతో

చైతన్యం

# శ్రీమతి జమునతో ముఖాముఖి

## 14 సంవత్సరాల వయస్సు నుండే సినిమాల్లో హీరోయిన్‌గా రాణించిన జమున



**ఎడిటర్: సినీ రంగంలో ప్రవేశించే ముందు సినిమాలగురించి మీకు అవగాహన ఉందా?**

అవగాహన అంటే, చిన్నప్పట్నుంచీ, ఫైన్ ఆర్ట్స్ మీద ఆసక్తి ఉండేది. చిన్నప్పుడు పల్లెటూళ్ళో స్కూల్లో డ్రామాలు అవీ వేసేదాన్ని. దాని తగ్గట్లు మా అమ్మ గారు కూడా ప్రోత్సాహం ఇచ్చేవారు. ఈ సినిమా రంగం అంటే ఆరోజుల్లో ఎవ్వరికీ పెద్ద సదభిప్రాయం ఉండేది కాదు. మా అమ్మగారికీ అంతే. అందువల్ల ప్రత్యేకంగా ప్రయత్నాలు ఏమీ చేయలేదు.

**ఎడిటర్: అంటే మీరు డ్రామాలు వేస్తున్నప్పుడు, రాజారావు గారు చూసి సినిమా అవకాశం ఇచ్చారు కదా ?**

అవును. డ్రామాల్లో నన్ను చూసి, రాజారావు గారు నన్ను పిలిపించి, ' పుట్టిల్లు' సినిమాలో డైరెక్ట్‌గా హీరోయిన్ చేశారు.

**ఎడిటర్: సినీ రంగానికి వచ్చేనాటికి మీ వయసు ఎంత ఉండొచ్చు?**

14 సంవత్సరాలు.

**ఎడిటర్: అప్పటికి మీకు సినిమా మీద అవగాహన ఉందా ?**

అవగాహన అంటే, సినిమా పిచ్చి ఉండేది. సినిమాలు తెగ చూసేవాళ్ళం. కొత్త సినిమా రిలీజ్ అవుతూనే మా అమ్మమ్మ గారు నన్ను, నా తమ్ముడ్ని, మా అమ్మగార్ని తెనాలి తీసుకెళ్ళి చూపించేవారు. కానీ సినిమా పరిశ్రమ అంటే మాత్రం కొంచెం



చెడ్డ అభిప్రాయం ఉండేది. అది నెమ్మదిగా ఎలా మారిందో చెబుతాను వినండి. ఆ రోజుల్లో సూర్యనారాయణమూర్తి గారు అని మాకు తెలిసిన ఆయన ఉండేవారు. ఆయన నాకు పాటలు నేర్పటానికి రోజూ మా ఇంటికి వస్తుండేవారు. ఓసారి ఆయన మా అమ్మగారితో 'మీ అమ్మాయిని సినిమాల్లో చేర్పించండి', అని అడిగారు. దానికి మా అమ్మగారు 'ఏం నాయనా, మా అమ్మాయిని సినిమాల్లో చేర్పించేందుకే మా ఇంటికి వస్తున్నావా', అని కోప్పడ్డారు. అప్పుడాయన 'అమ్మా ! మీరు భానుమతిగారిని చూడండి. ఆవిడ పెద్ద హీరోయిను ఆయినా సంసార పక్షం గానే ఉంటారు. మనం బాగుండాలి, గౌరవంగా జీవించాలి అంటే జీవించచ్చు. అదంతా మన చేతిలో ఉంది' అని అన్నారు. అలా ఆయన ఎప్పుడూ భానుమతి గారిని గురించి చెబుతుండే రు. అలాగే టెక్నీషియన్స్, డైరెక్షన్, ఏ వేషాలు తీసుకోవాలి ఇలా అన్ని చెబుతుండేవారు. ఎవరిని ఎక్కడ పెట్టాలి, ఎవరితో ఎలా ప్రవర్తించాలి ఇలా అన్నీ చెప్పేవారు. మీ అమ్మాయిగారు చిన్న వేషాలు వేయకూడదు. అలా చేస్తే గౌరవంగా ఉండదు. డైరెక్ట్‌గా హీరోయిను వేషంవేయాలి. మనం కంపెనీ చుట్టూ తిరగకూడదు, వాళ్ళే మన దగ్గరికి వచ్చేట్టు నేను చూస్తాను. అలా 'జై వీర భేతాళ' అనే సినిమాలో హీరోయిన్‌గా ఇప్పించారు. అందులో గుమ్మడి గారు హీరో. ఆ సినిమా అయిదు రోజులు షూటింగ్ జరిగింది. తర్వాత ఆగిపోయింది. ఆ తర్వాత రాజారావు గారి 'పుట్టిల్లు' సినిమాలో హీరోయినుగా చేసాను.

**ఎడిటర్: మొట్టమొదటిసారి హీరోయిన్‌గా కెమెరా ముందు నించున్నప్పుడు ఎలా అనిపించింది?**

భయం ఏఁవీ వేయలేదు. ఎందుకంటే డ్రామాలు అవీ వేసాను కాబట్టి భయం అనిపించలేదు. కానీ 'రషెస్' అని చూస్తాము ప్రింట్ రెడీ అవగానే. నాకైతే అదృష్టవశాత్తూ స్క్రీన్ టెస్ట్, మేకప్ టెస్ట్, ఇలాంటివి ఏఁవీ జరగలేదు . అందువల్ల సినిమాలో నా ముఖం తెరమీద ఎలా కనపడుతుందోనని కొంచెం ఏదో

# కేప్ టౌన్ విహార యాత్ర



సౌత్ ఆఫ్రికా లో జోహన్స్‌బర్గ్ తరవాత అతి పెద్ద నగరం కేప్‌టౌన్. ప్రపంచం లోని అందమైన నగరాలలో కేప్‌టౌన్ ఒకటి. అక్కడికి వెళ్ళాలంటే సౌత్ ఆఫ్రికా వీసా ఉండాలి. దుబాయ్ నుండి కేప్‌టౌన్ కి డైరెక్ట్ విమానాలు ఉన్నాయి.మా వారు సౌత్ ఆఫ్రికా పక్కనే ఉన్న మొజాంబిక్ అనే చిన్న దేశంలో పని చేస్తున్న కారణంగా , మొజాంబిక్ కేపిటల్ ' మపుతో ' నుండి మరో రెండు తెలుగు కుటుంబాలతో కలిసి బయలు దేరాం. కాలానికి అనుగుణంగా కేప్‌టౌన్ ను సందర్శించాలనుకునే వారికి ఏప్రియల్ నుండి జూన్ వరకు, మరలా సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు అనువు గా ఉండే కాలాలు. డిసెంబరు నెల వారికి వేసవి కాలం. ఏప్రియలు నుండి 2 నెలలు వారికి చలికాలం. కేప్ టౌన్ ప్రయాణం మరింత గుర్తుండిపోయేలా ప్లాన్‌చేసుకుంటే జోహన్స్‌బర్గ్ చేరు కుని అక్కడి నుండి 26 గంటలు సమయం పట్టే ట్రైయిన్ లో వెళ్ళాలి.

భారతదేశం లోని 'ప్యాలస్ ఆన్ వీల్స్ ' రైలును గురించి వినే ఉంటారు. అలాంటి అన్ని సదుపాయాలు కలిగి, అంతర్జాతీయ ప్రమాణాలతో, డైనింగ్ టేబుల్స్, పార్టీ హాల్, జిమ్, ఆయిల్ మసాజ్ గదులు ఇలా 26 గంటలు ప్రయాణం ఎంతో ఉత్సాహంగా , గమ్మత్తుగా ఉంటుందట. మావారికి, ఆయన స్నేహితులకి ఎక్కువ శలవలు లేని కారణంగా మపుతో నుండి కేప్ టౌన్ 3 గంటలు ఫ్లైట్లో వెళ్ళాము. మే నెల కారణంగా వారికి చలికాలం కదా, కొంచెం చలిగా వుంది. ముందే బుక్ చేసుకున్న హోటలు వారు ఎయిర్ పోర్టుకి కార్లు పంపించారు. పర్యాటక ప్రదేశం కాబట్టి ఆ యా దేశాలనుండి వచ్చే సందర్శకులకు హోటల్సు వారు వారు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

చుట్టూ ఉన్న అందాలు చూస్తూ హోటలుకి చేరుకున్నాం. కేప్‌టౌన్ లో చూడదగ్గ ప్రదేశాలు అంటే వైన్‌యార్డ్సు, అక్వేరియం, బొటానికల్ గార్డెన్సు, కేప్ ఆఫ్ గుడ్ హోప్, టేబుల్ టాప్ మౌంటెన్ మరియు బర్డ్ సాన్‌చూరియాలు అన్నింటికన్నా ముఖ్య మైనవి. వీటిలో టేబుల్ టాప్ మౌంటెన్ తప్పని సరిగా చూడదగ్గది. మరలా పెంగ్విన్ పార్కులో బోలెడన్ని పెంగ్విన్స్ చూసామండోయ్ !



శ్రీమతి భారతి

ఇక కేప్ టౌన్ నగరం ప్రకృతి మాత ఒడిలో , సముద్ర తీరంలో కొండ కోనల మధ్య , పచ్చని చెట్లతో చాలా అందమైన నగరం. అక్కడి ప్రభుత్వం రెడ్ బస్సులను, డబుల్ డెక్కర్ బస్సులు – పై అంతస్థులో టాప్ ఉండదు. మనిషికి 250 రేండ్స్ ( ఆ దేశం కరెన్సీ ) చొప్పున కడితే 2 రోజులు ఆ బస్సులో ఎక్కుతూ దిగుతూ వారి సేవలను వినియో గించుకోవచ్చు. ఆ బస్సులో ప్రతి సీటుకి అమర్చిన ఇయర్ ఫోన్స్ ద్వారా మనకు కావలసిన భాషలో – ఇంగ్లీషు, పోర్చుగీస్, ఫ్రెంచ్ భాషలలో ఏది కావాలంటే దాంట్లో , ఆ బస్సు తీసుకు వెళ్ళే ప్రదేశాల గురించి, వాటి విశిష్టత, వివరాలు చక్కగా మనం విని తెలుసుకోవచ్చు. 969 లో మొట్టమొదటి ' హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ' జరిగిన నగరం కేప్ టౌన్ .ఆ ఆసుపత్రి మీదుగా బస్సులో ప్రయాణించాము. పర్యాటక ప్రదేశం కావటంతో అన్ని దేశాల రెస్టారంట్లు ఉన్నాయి. వాటెన్‌సిటీ అనే హోటలులో తెలుగు వాళ్ళు పని చేస్తు ఉండటంతో ...రోజంతా సిటీ టూర్ తిరిగి రాత్రి అక్కడే భోంచేసి హోటలు చేరుకోవడం కూడా చాలా ఆనందాన్నిచ్చింది.

ఇక వైపు యార్డులు – ఆ ద్రాక్ష తోటలలో 30 నుండి 50 సంవత్సరాల

# మూర్తి మాట



కీ.శే. మంగళంపల్లి రామనరసింహామూర్తి

( గత సంచిక తరువాయి )



భావ మొకటియైన బంధించు మిత్రులన్
బంధువులకు రక్త బంధనంబు
దొంగ ప్రేమలందు దొరలురా బంధువుల్
ముచ్చటలర వినుము మూర్తిమాట 8



మంచి మగడు దొరక మాఢ్బి చంపుదురయ్య
పెద్దవానితోడ చెలిమిలేక
ఉభయ భ్రష్టులగుట యువిదల కర్మరా
ముచ్చటలర వినుము మూర్తిమాట 9

మొదటి యడుగుతోడ మొదలు నీయానమ్ము
అడుగు వేయకుండ నడకరాదు
వేయబూనవేని శివుడేమి చేయురా !
ముచ్చటలర వినుము మూర్తిమాట 5





భౌతికమును వదలి "బంధి" సూక్ష్మమునకున్
ఆదియు విడచి కారణంబునకును
త్రివిధ యానములను దివ్యానుభూతిరా
ముచ్చటలర వినుము మూర్తిమాట 6

కృషిని సల్పలేని వానికిన్ , రోగికిన్
ధన విహీనునకును దళితునకును
కోపమెక్కువగుట శాపమే యగునురా
ముచ్చటలర వినుము మూర్తిమాట 7



## వధూ వరణము - మూడవ భాగము

# వివాహం - ప్రాశస్త్యం

( గత సంచిక తరువాయి )

**7. స్నాతక వ్రతం ( కాశీయాత్ర ) :**

వివాహానికి పూర్వం వరుడు తన గృహంలో కాని, వివాహ విడిదిలో కాని 'స్నాతక వ్రతం' చేసుకోవడం ఆచారంగా ఉన్నది. ఈ స్నాతక వ్రత పరిసమాప్తిలో వరుడు కాశీ యాత్రకి బయలుదేరడం, వధువు సోదరుడు ఎదురాగావచ్చి తనసోదరిని వివాహం చేసుకోమని కోరడం,దానికి అంగీకరించి, వరుడు తిరిగి విడిదికి రాగా వివాహ ప్రయత్నం జరగడం విధిగా జరుగుతోంది.

ఈ స్నాతకవ్రతం మన ఆచారంలో మిక్కిలి ప్రాశస్త్యం కలిగిఉన్నది. వరుడు తన విద్యాభ్యాసాన్ని కొనసాగించడానికి,ఈ నయనం అయినతర్వాత స్నాతక వ్రత దీక్ష తీసుకుంటాడు. స్నాతకుడు అంటే కొంత విద్యను అభ్యసించిన తర్వాత, ఆ విద్యలో మరింత ప్రావీణ్యత సంపాదించ దానికి పై చదువులు చదివే విద్యార్థి అని అర్థం. అందుకే ఈనాడు డిగ్రీ పై చదువులని స్నాతకోత్తర విద్య ( పోస్ట్ గ్రాడ్యుయేషన్) అని పిలుస్తున్నారు. అలా డిగ్రీలు ప్రదానం చేసే ఉత్సవాన్ని' స్నాతకోత్సవం ' అని అంటున్నాం.

ప్రాచీన కాలం లో ఉన్నత విద్య అభ్యసించాలంటే కాశీనగరం వెళ్ళాల్సి వచ్చేది. అక్కడ చదివి పాండిత్యాన్ని గడిస్తే ఉన్నత విద్యను పొందినట్లు అవుతుంది. జీవితంలో అక్కడకు చేరి విద్యను పొందాలని తహతహలాడే వారు. అందుకే విద్యార్థి స్నాతకదీక్షను తీసుకుని కాశీకి బయలుదేరేవారు.

స్నాతకునికి కొన్ని ధర్మాలు నిర్దేశించబడ్డాయి. లోపలబట్ట, బయట ఉత్తరీయాన్ని ధరించాలి. వెదురు బెత్తాన్ని దీక్షా చిహ్నంగా స్వీకరించాలి. ఉదకం తో కూడిన కమండలాన్ని ధరించాలి. రెండు యజ్ఞోపవీతాల్ని ధరించాలి. తలపాగ, చర్మం,ఉత్తరీయం, చెప్పులు, గొడుగు, ఏకాగ్ని పరిచరణం, స్థాలీపాకం ధరించి ఉండాలి. పూలదండ, ముఖానికి చందనాదిలేపనాలు, బొట్టుకి సుగంధతైలం, కాటుక, అభ్యంగన, తలపాగా, నడుముకి వస్త్రం, చొక్కా



పాదుకలు ధరించాలి. ఈ వేషాన్ని ధరించి కాశీలో విద్యాభ్యాసానికి పయనమవుతాడు. అతనిని సాగనంపడానికి వెడుతుండగా వధువుయొక్క సోదరుడు ఎదురుగా వచ్చి తన సోదరిని పెళ్ళి చేసుకుని గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని కోరడం జరుగుతుంది. వరుడు తన బ్రహ్మచర్యాన్ని విడిచి, గృహస్థాశ్రమమును స్వీకరించడం జరుగుతుంది. దీనిని స్నాతకం అని కాని, కాశీయాత్ర అని కాని పిలుస్తారు. ఇది వివాహ ప్రక్రియలకు ముందుభాగం. వివాహంలో భాగం మాత్రం కాదు. సమయాభావం వలన ఈ తంతుని విడిదిలో పెళ్ళికి ముందు చేస్తున్నారు.

**8. రక్షాబంధనం** :పాణిగ్రహణానికి ముందుగా, వధూవరుల రక్ష కై ఈ రక్షాబంధనం చేయిస్తారు. రక్షాబంధన దేవతలకి నమస్కరించి, షోడశోపచార



✍ డా॥ పోచనపల్లి వెంకట మురళీకృష్ణ
ఎం.ఏ., పిహెచ్.డి.

# గణిత చైతన్యం

- అంకెల మామయ్య చంద్రయ్య ( 9440926937)

హాయ్ ఫ్రెండ్స్ !

పోయిన నెలలో కేలిక్యులేటర్ తో ఆడుకునే ఒక గేమ్ గురించి చదువుకున్నాం కదా. ఈసారి ఇంకో మ్యాజిక్ సంఖ్య గురించి నేర్చుకుందాం. కేలిక్యులేటర్ తో తయారుగా ఉన్నారా ? చదవండి మరి !

హాయ్ ఫ్రెండ్స్ !

పోయిన నెలలో కేలిక్యులేటర్‌తో ఆడుకునే ఒక గేమ్ గురించి తెలుసుకున్నాం కదా?అందులో మన మ్యాజిక్ సంఖ్య ఎంతో గుర్తుందా? ఆ సంఖ్య 12345679.

ఇప్పుడు ఇంకో మ్యాజిక్‌సంఖ్య తెలుసుకుందాం.కేలిక్యులేటర్ తో రెడీగా ఉన్నారు కదా ?

మీ కేలిక్యులేటర్ లో 37037037 అని డిస్ప్లే చేయండి. ఆ తర్వాత " x " అనగా గుణకారం నొక్కండి. ఇప్పుడు మీ మిత్రుణ్ణి ఏదైనా ఒక అంకెను చెప్పమనండి. 1 నుండి 9 వరకు ఏ అంకైనా ఫరవాలేదు, ఉదా:మీ మిత్రుడు '7' చెప్పాడనుకోండి మీరు వెంటనే 21 నొక్కండి. తర్వాత '=' నొక్కండి. అంతే 37037037 మాయమై అన్నీ " 777777777 " ప్రత్యక్షమౌతాయి.

ఇలా ఏ అంకె అడిగినా ఆ అంకె వచ్చేలా చేయవచ్చు.

ఉదా: 370370370 ని అన్నీ " 4 " గా మార్చాలనుకోండి. దానిని 12 తో గుణించాలన్నమాట.

37037037 × 12 = 444444444

' క్లూ ' అర్థమయిందనుకుంటాను. మనకు ఏ అంకెలకావాలనుకుంటే, ఆ అంకెను 3 పెట్టి గుణించాలి.ఆ లబ్ధం తో మన 37037037 ని గుణించాలి. అన్నీ 2 కావాలనుకుంటే 3×2=6 పెట్టి గుణించాలి.అంటే మనకు 3 వ ఎక్కం తెలిసి ఉండాలన్నమాట.

| | | | | |
|---|---|---|---|---|
| 37037037 | X | 3 | = | 111111111 |
| 37037037 | X | 6 | = | 222222222 |
| 37037037 | X | 9 | = | 333333333 |
| 37037037 | X | 12 | = | 444444444 |
| 37037037 | X | 15 | = | 555555555 |
| 37037037 | X | 18 | = | 666666666 |
| 37037037 | X | 21 | = | 777777777 |
| 37037037 | X | 24 | = | 888888888 |
| 37037037 | X | 27 | = | 999999999 |

అర్థమయ్యింది కదా క్యాలిక్యులేటర్‌తో ఎలా ఆడుకోవాలో? అంతే కాదు, మీరు కూడా కొత్త మ్యాజిక్ సంఖ్యలను కనిపెట్టే ప్రయత్నం చెయ్యండి. ఏ మ్యాజిక్ సంఖ్యకు ఏ ఎక్కం అనుబంధమో తెలుసికోండి.

మరొక మ్యాజిక్ సంఖ్యతో వచ్చేనెలలో మళ్ళీ కలుసులుందాం.

బై బై

అంకెల మామయ్య

# SPOKEN ENGLISH
(With Grammar)

– వి.వేణుగోపాల్, ఎం.ఎ, బిఎడ్
సెల్ : 9010814662

## HELPING VERBS / AUXILIARY VERBS

### PAST

**Was, Were లను ఉపయోగించడం**

### POSITIVE SENTENCES

Formula ——— Subject + wass / were + object

Subject ——— I, He, She, It, Single name అయితే was వాడాలి
Subject ——— They, We, You అయితే were వాడాలి

**Examples :**

| | |
|---|---|
| 1. నేను నిన్న ఇంట్లో వున్నాను | I was at home yesterday |
| 2. నేను 1999 లో కాలేజ్ టీమ్ కి కెప్టెన్ గా వున్నాను | I was the captain of the college team in 1999 |
| 3. అతను 8 గంటలకు మేడ మీద వున్నాడు | He was upstairs at 8 o'clock |
| 4. పది నిముషాల క్రితం ఆమె ఎక్కడో వుంది | She was somewhere ten minutes ago |
| 5. ఆ పెట్టె నిండా వస్తువులు వుండేవి | The box was full of things |

### NEGATIVE SENTENCES

Formula ⟶ Subject + wass / were +not + object

| | |
|---|---|
| 1. ఆ సమయంలో నేను అక్కడ లేను | I was not there at that time |
| 2. అతను మరియు ఆమె గత సం. కలిసి వుండలేదు | He and she were not together last tear |
| 3. మేము నిన్న అక్కడ లేము | We were not there yesterday |
| 4. గత సం. వారు గుంటూరులో లేరు | They were not in Guntur last year |
| 5. రెండు సం.ల క్రితం అది అక్కడ లేదు | It was not there two years back(ago) |

### Questions Type 1

Formula — Was / Were + Subject + object

| | |
|---|---|
| 1. నువ్వు నిన్న ఇక్కడ ఉన్నావా ? | Were you here yesterday ? |
| 2. ఆమె నిన్న సంతోషంగా వుందా ? | Was she happy yesterday ? |
| 3. వారు 1998 లో అమెరికాలో వున్నారా ? | Were they in America in 1998 ? |
| 4. అతను గంట క్రితం కోపంగా వున్నాడా ? | Was he angry an hour back ? |
| 5. వాళ్ళు గత సం. ఇక్కడ వున్నారా ? | Were they here last year ? |

విశ్వము - సృష్టి - 10

# ఆధునిక విజ్ఞానము - వైదిక జ్ఞానము

*(గత సంచిక తరువాయి)*

## 50

సృష్టికి పూర్వం కేవలం సద్రూపమైన బ్రహ్మమే ఉండేది. "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ". బ్రహ్మము ఒక్కటే, దానితోపాటు రెండవది ఏదీ లేదు. ఇది అద్వైతవేదాంతం చెబుతుంది. ఇదే పారమార్థిక సత్యం. బ్రహ్మము నిర్గుణం, నిరాకారం, నిరంజనం. మనకు తెలిసిన ఏదీకానిది. అదే ఆత్మ (అయమాత్మా బ్రహ్మ). మనకు తెలిసిన ప్రపంచం కావాలంటే ఒకటీ చాలదు. ఒకటి రెండు కావాలి. ఆ రెండు తత్వాలూ పూర్తిగా విభిన్నమైనవి. వాటిని అనేక విధాలుగా వ్యవహరిస్తారు. సాంఖ్యములో అవి ప్రకృతి, పురుషుడు (స్త్రీ, పురుష తత్వాలు). పంచబ్రహ్మ సిద్ధాంతములో అవి కామేశ్వరి, కామేశ్వరుడు, శాక్తేయములో శక్తి, శివుడు. ఒకటి చైతన్యము. ఒకటి జడము. ఒకటి వాక్కు, ఒకటి అర్థము. ఒకటి ద్రవ్యము (పదార్థము) ఒకటి శక్తి. ఇవి సృష్టిలోని ద్వంద్వములు. సృష్టిలోని ఇంకొక ద్వంద్వము కుడి ఎడమలు. ఒకటి దక్షిణపార్శ్వము. ఒకటి వామపార్శ్వము. మన సంస్కృతిలో వీటిని సమానముగా అంగీకరించము. దక్షిణ హస్తము వామ హస్తము మిగిలినది, గుడిలో చేయవలసి నది ప్రదక్షిణము, అప్రదక్షిణము కాదు. ఆరాధనలో, తంత్రాలలో, ఆగమాలలో దక్షిణాచారము,వామాచారములు పూర్తిగా విభిన్నమైనవి. యజ్ఞోపవీతం ఎడమ భుజంపై వేసుకోవాలి. ప్రత్యేక సమయాలలో రెండవ భుజంపై ధరించాలి. మన నిత్యజీవితంలో కూడా దక్షిణ వామ



హస్తాలకు, పాదాలకు ప్రత్యేకత ఉన్నాయి. నూతన గృహప్రవేశాదులలో కుడిపాదము ముందు లోపలపెట్టి ప్రవేశించడం ఆచారం. ముక్కు తిమ్మన్న గారి పారిజాతాపహరణ కావ్యములో సత్యభామ వామపాద తాడన ప్రసక్తియున్నది.

*జలజాతాసన వాసవాది సుర*
*పూజా భాజనంబై తన*
*ర్చు లతాంతాయుధు కన్న తండ్రి*
*శిరమచ్చో వామ పాదంబునం*
*దొలగం ద్రోచె లతాంగి! యట్ల*



శ్రీ వి వి ఎస్ శర్మ

*యగు నాథుల్ నేరముల్ సేయ పే*
*రలుకన్ జెందినయట్టి కాంతలుచిత*
*వ్యాపారముల్ నేర్తురే?*

భారతీయ శిల్పాలలో, చిత్రా లలో, ఆలయాలలో, వాస్తుశాస్త్రంలో, ఆరాధనా విషయాలలో దక్షిణ వామ పార్శ్వాల ప్రత్యేకతలను గమనించ వచ్చును.

## 51

విశ్వ సృష్టిలోనే రెండు ఘట్టాలుం టాయి. ఒకటి సృష్టి ఆవిర్భావం, ఒకటి లయము. చాంద్రమాసములో శుక్ల, కృష్ణ పక్షములతో పోల్చవచ్చును. సృష్టిలో ద్వంద్వములు ఉత్తరాయణ, దక్షిణాయన ములలోనూ, అహోరాత్రములలోనూ, శుక్లపక్ష, కృష్ణపక్షములలోనూ, శుక్ల కృష్ణ మార్గములలోనూ చూడవచ్చును. భగవద్గీత 8వ అధ్యాయంలో ఈ చర్చ కనుపిస్తుంది.

*అగ్నిర్జ్యోతిరహః శుక్లః*
*షణ్మాసా ఉత్తరాయణమ్!*
*తత్ర ప్రయాతా గచ్ఛన్తి*

శ్రీ బోధ-19

# నాలుగు 'మాట'లు



- శ్రీ భువన చంద్ర

*(గత సంచిక తరువాయి)*

ఓ కాలేజీలో నాటకం వేస్తూ, తను వేసే పాత్రలో 'లీనం' అయిపోయి... నాటకం అయిపోగానే అటునించి అటే రైల్వేస్టేషన్‌కి వెళ్ళిపోయిన మహానుభావుడు మా స్వామీజీ. నాటకంలో ఆయన వేసింది 'సన్యాసి' వేషం. ఆయన ఊరేమో కేరళలోని 'కావడి' గ్రామం. హిందూ ధర్మాన్ని పునరుద్ధరించిన శ్రీ శంకరాచార్యుల వారిదీ కాలడి గ్రామమే. మా స్వామీజీ వారూ, శంకరా చార్యుల వారూ 'నంబూద్రి' బ్రాహ్మణులే. 14 సంవత్సరాలు హిమాలయాల్లో తిరుగాడి ఎందుకో వారు 'భద్రాచలం' వస్తే అక్కడినించి మావూరి భూస్వాములు బండి బాబూరావుగారూ, రాఘవమ్మగారు స్వామీజీని మా వూరు తీసుకొచ్చారు. వారి కెందుకో వూరు నచ్చి, బాబూరావు దంపతులు చూపిన స్థలంలోనే పాక వేసుకొని వుంటూ, కాశీనించి 'శివ లింగాన్ని' తెప్పించి మొదట కాశీ విశ్వనాథ ప్రతిష్ఠ, శ్రీ ఆదిశంకరాచార్యుల వారి ప్రతిష్ఠ ఆ తరవాత శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి ప్రతిష్ఠ చేయించారు.



నిజం చెప్పాలంటే మా చింతలపూడికి వైరాగ్యపు (లేక) వేదాంతపు తళుకులద్దింది - సువాసనల్ని తెచ్చిందీ మా స్వామీజీ శ్రీశ్రీశ్రీ బోధానందపురి మహరాజ్ గారే. మా చిన్నతనంలో వారి వల్లనే, మేము వేదాంత గ్రంథాల పరిచయాన్నీ, చక్కని బోధనల్నీ పొందింది. అప్పటి విషయాల్నే నేను మీకు ధారావాహికంగా అందిస్తున్నది.

ప్రతి సంవత్సరం ఎంతో మంది సర్వసంగ పరిత్యాగులూ, యోగులూ, పరివ్రాజకులూ, హరికథా సామ్రాట్టులూ, ప్రవచనకారులూ ఆశ్రమానికి వస్తూ వుండే వారు. ఎన్నెన్నో మంచి విషయాల్ని చక్కగా వివరించి చెప్పేవారు.

పెద్దలని ఎలా గౌరవించాలో, వారితో ఎలా మెలగాలో ఇవన్నీ మేము నేర్చుకున్నది స్వామీజీ దగ్గరే.

మొదట్లో నేనూ మా స్నేహ బృందమూ (అందరూ 10 ఏళ్ళలోపే) కూడా నానా పోచుకోలు కబుర్లు చెప్పు కుంటూ వుండేవాళ్ళం. పేరుకి మా చింతలపూడి తాలూకా హెడ్‌క్వార్టర్ అయినా, పట్టణ వాతావరణం ఏమాత్రం కనిపించేది గాదు. పల్లెటూరి వాతావరణమే వుండేది. రెండు టూరింగ్ టాకీసులు ఉండేవి. ఏ సినిమా వచ్చినా సందడే.

పొలాలన్నీ (చెరువుల కింద వున్నవి తప్ప) వర్షాధారం పొలాలు కావడంతో జనాలూ పేదరికంతోనే ఉండేవారు. అటువంటి చోట సాహిత్యమూ, కళలూ లాంటి సున్నితమైన వాటికి చోటెక్కడా? చదివి... ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుంటే చాలు అనుకునే వాళ్ళం. అదే మా జీవిత ప్రధానోద్దేశం. స్వామీజీ రాకతో మా ఆలోచనల్లో మార్పువచ్చింది. యీలోకం కేవలం ఓ 'విడిది' అనీ ఏదో ఓ రోజు దీన్ని వదిలి వెళ్ళి తీరాలని తెలిసివచ్చింది.

మేం చదివే చదువులు కూడా కేవలం 'బ్రతుకుతెరువు' చదువులే గానీ 'సత్యాన్ని' బోధించే చదువులు కావని కూడా

# కాదనటం కూడా కళే



నిజం చెప్పాలంటే కాదనటం గొప్ప కళ. ఏదైనా 'సరే' ననటానికి గొప్ప తెలివితేటలు, ఆలోచనా సామర్థ్యం, బ్రహ్మాండమైన ప్రణాళిక వంటివి అవసరం లేదు. 'సరే' ననే మాట ఎట్లా అన్నా, అది తమకు అనుకూలంగా ఉంది కనక ఎవరూ పెద్దగా పట్టించుకోరు. సమస్య వచ్చేది కాదని చెప్పవలసి వస్తేనే! కాదనవలసివస్తే ఎంతో మర్యాదగా, మరింత మృదువుగా చెప్పవలసి ఉంటుంది. ఎందుకంటే, ఒక విషయంలోనో, ఒకసారో భేదాభిప్రాయం వచ్చినంత మాత్రాన మనుషుల మధ్య సంబంధాలు తెగిపోవు కదా! పైగా ఒకరి ముఖం మరొకరు చూసుకోకుండా ఉండరు. తెలిసిన వారైతే ఎప్పుడైనా ఎదురు పడక తప్పదు. బంధువులయితే అప్పుడప్పుడూ కలవాల్సి ఉంటుంది. కావలసిన వారైతే అంటే, కుటుంబ సభ్యులో, ఉద్యోగం చేసేచోట కలిసి పనిచెయ్య వలసినవారో అయితే నిత్యం ముఖాలు చూసుకోవలసి ఉంటుంది. ఒక్కసారి పెడసరంగా సమాధానం చెప్పి సంబంధాలు దెబ్బతింటే మళ్ళీ పునరుద్ధరించుకోటానికి చాలా సమయం పడుతుంది. కొన్నిసార్లు పుటుక్కున తెగిన బంధం అతుక్కోకపోవచ్చు కూడా. అందుకనే ఎదుటి వారి మాట కాని, ప్రతిపాదన కాని, అభిప్రాయం కాని నచ్చనప్పుడు వీలైతే ఊరుకోపటం మంచిది. మాట్లాడక తప్పని పరిస్థితి అయితే చాలా జాగ్రత్తగా మాటలని ఎన్నుకోపటమే కాదు, గొంతుని, ముఖకవళికలని కూడా అదుపులో ఉంచుకోవాలి.

ఉదాహరణకి 'ఈ చీర ఎలా ఉంది? మీ అన్నగారు ఢిల్లీ వెళ్ళినప్పుడు ఎన్నో దుకాణాలు వెతికి వెతికి నాకోసం తెచ్చారు', అని పక్కింటి పంకజాక్షి ఒక చీరని చూపించారనుకోండి. అంతటి చౌకబారుది మరొకటి లేదని మీకనిపించిందను కుందాం. అంత మాత్రాన నేనే సత్యహరిశ్చంద్రుడి వారసత్వం పుణికి పుచ్చుకున్నాను అని ఆ మాటని మొహం మీద చెప్పలేరు కదా! 'బాగానే ఉంది' అని ఊరుకుంటారు. మరీ గట్టిగా 'రంగు బాగుంది కదూ, డిజైన్ బాగుంది కదూ, ఏమంటారు?' అని గుచ్చిగుచ్చి అడిగితే ఏం చెప్పగలరు?

అప్పుడే బయట పడుతుంది మనిషికున్న చాకచక్యం. ఈ సందర్భానికి తగిన చక్కని కథ చెపుతారు. ఒకసారి జ్యేష్ఠాదేవి, లక్ష్మీదేవి, ఒక పండితుడి వద్దకు వచ్చి మా యిద్దరిలో ఎవరు అందంగా ఉంటామో చెప్పమని అడిగారు. ఎవరందంగా ఉంటారని చెప్పినా ప్రమాదమే! రెండవ వారికి కోపం వస్తుంది. అందుకని ఆలోచించి వారిద్దరినీ ఒకసారి నడవమన్నాడు. వారు నడిచారు. అప్పుడు చెప్పాడు. 'కదలకుండా ఉంటే ఇద్దరూ అందగత్తెలే! అందం కదలికల్లో కూడా ఉంటుంది కదా! అందుకని నడవమన్నాను. అమ్మా! జ్యేష్ఠాదేవీ! నువ్వు వెడుతుంటే అందంగా ఉన్నావు. తల్లీ! లక్ష్మీ దేవీ! నువ్వు వస్తుంటే అందంగా ఉన్నావు. మీ ఇద్దరిలో ఈ తేడా ఉంది' అన్నాడు. దానితో జ్యేష్ఠాదేవి ఆయన ఇంటినుండి అందంగా ఉన్నాననుకుంటు వెళ్ళింది. ఆయన దరిద్రం వదిలింది. లక్ష్మీదేవి తను



- డా. అనంతలక్ష్మి

# శ్రీకృష్ణ స్తుతి



శ్రీమతి జానకి

1. కృష్ణుని నామ మెల్లపుడు
ఇష్టముతోడ స్మరించుచుండినన్
కష్టములు ఎట్లు ఏర్పడును
నీరును నిప్పు దహించగలునే!

2 బ్రహ్మయు విష్ణు ఈశ్వరుడు
వారినతుల్ ఒనగూర్చు కార్యముల్
అంతయు తానే యనుచు
నంతయు అంటని బ్రహ్మమొక్కడే

3. రేపల్లియలో వెదకెద
ఏ గొల్లెత ఇంటిలోనో దాగెద
ఆ పిల్లనగ్రోవిని వినగా
అల్లన అరుదెంచి నల్లనయ్య గాంతున్

4. క్షమియించవు పొరపాటుల
శయనింతువు కల్మషంబు లెరుగని మదిలో
ధరియింతువు బహురూపుల
పులకింతును నీదు మహిమ గాంచినయంతన్

5. లాలన చేసెద నిను గో
పాలా నా ఒడిని చేర్చి లాలించెద నా
పాలిటి దైవము నీవై కా
పాడెదవనుచు నమ్మి కొలిచితినయ్యా!

6. మారాదకు నా మాటకు
పారాడును మనసు నిన్ను వదలిన క్షణమే
తారాడును గతి కానక
జేరాదెదు పట్టు పుట్ట మమరగ రారా



# వైద్యశాస్త్రం దాని పుట్టు పూర్వోత్తరాలు

గత మూడు సంచికలనుండి వరుసగా హోమియో తత్వ శాస్త్రము గురించి తెలుసుకుంటున్నాం. హోమియో తత్వం తెలియకపోతే హోమియో వైద్య విశిష్టత తెలియదు.చాలా మంది పాఠకులు హోమియో వైద్యము యొక్క సిద్ధాంతములను, తత్వమును తెలుసుకొనాలని కోరుకోవటం చేత హోమియో తత్వ శాస్త్రమును గురించి చర్చించుకుందాం.

*(గత సంచిక తరువాయి)*

హిప్పోక్రేట్స్ ప్రవేశపెట్టిన శాస్త్రీయ వైద్యము ఎస్క్లీపియస్ వైద్యవిధానమును తప్పు పట్టి, దేవతల కోపానికి జబ్బులొస్తాయి. దేవతల అనుగ్రహం వల్ల జబ్బులు తగ్గుతాయి అనే విషయాలు మూఢ నమ్మకాలుగా కొట్టివేయడం జరిగినది. జబ్బుల కారణాలు, హిప్పోక్రేట్స్ ఓత్, రోగ పరిశీలన, సహజమైన మందులు వాటి ప్రయోగాలు, మందులు భద్ర పరచుట, రోగిని గురించి సమగ్రమైన అవగాహన గురించి కూడా తెలుసుకుంటాము.



గ్రీకులు జబ్బును నయం చేయ దానికి రక్తస్రావం చేయడం కాని, వాంతులు చేయించడం కాని, విరేచనాలు చేయించడం కానీ చికిత్సలలో ఉపయోగించేవారు. రక్తస్రావం చేయడం 19వ శతాబ్దం వరకు వాడుకలో ఉండేది. కత్తితో గాటు పెట్టో, జలగలు పట్టించో రక్తస్రావము చేయించే వారు. చెట్ల మందులతో వాంతులు, విరేచనాలు చేయించేవారు. తలనొప్పి అంటే రక్తస్రావం, వ్యాయామాలు మొదలగునవి చేయిస్తుండేవారు. పరిసరాల పరిశుభ్రత, కాలకృత్యాల ఉపయోగం, ఆరోగ్య పరిరక్షణ గురించి కూడా వీరు తీసుకున్న శ్రద్ధను గమనించగలము.

**అరబిక్ వైద్యము (ఇస్లామిక్ వైద్యము)**

అరబిక్ వైద్యం గురించి చెప్పాలంటే క్రీ.శ. 8వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు స్వర్ణయుగమని చెప్పాలి. అరబిక్ వైజ్ఞాన పరిశోధకులు ఆ రోజులలో ప్రపంచంలో ఉన్న విజ్ఞాన సర్వస్వాన్ని గ్రహించి అభివృద్ధి చెందినారు. దానిని వ్యాపింప చేయడానికి కృషిచేసారు. ఆ తర్వాత వందల సంవత్సరాలు సైన్సులో, వైద్యంలో ఎదిగారు. గ్రీకు వైద్యశాస్త్ర రహస్యాలను వాళ్ళ వైద్య గ్రంథాలలో చొప్పించారు. వాటిని ఆఫ్రికా ఖండములో స్పెయిన్ మరియు ఫ్రాన్సు దేశాలలో వైద్యాన్ని విస్తరించారు.



డా. ఎస్ కృష్ణమూర్తిశాస్త్రి,
ఎం.డి. (హోమియో)

ఆ మధ్య యుగములో ప్రపంచంలో ఒక్క ఇస్లామిక్ దేశాలలో తప్ప చాలా చోట్ల వైద్యవ్యాప్తి ఆగిపోయి చీకటి రాజ్యమేలుతున్న రోజులు. అరబ్బులు వైద్య శాస్త్రమును గ్రీకు దేశ, భారత దేశ, ఈజిప్టు, చైనా మొదలగు దేశాలనుండి గ్రహించి వారికి నచ్చిన విధానాలను వారు ఆచరించారు. మందులు తయారు చేయు విధముల గురించి ప్రత్యేక విభాగములను ఏర్పరచి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటికీ వారు ప్రవేశపెట్టిన అనేక పదాలు వాడుకలో ఉన్నాయి. ఉదాహరణకు ఆల్కహాలు, ఆల్కలి, ఎలిగ్జర్, సిరప్ మొదలగునవి అరబిక్ పదాలే.

బాల చైతన్యం

# దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు



కళా సేవారత్న
శ్రీ పోదూరి శ్రీనివాసరావు

బాలలూ.....

తెలుగు వారిలో ప్రముఖ జాతీయతావాది, వ్యాపారవేత్త, రాజకీయవేత్త, ఆధ్యాత్మికవేత్త, సంఘసంస్కర్త, జర్నలిస్టు, ప్రచురణకర్త అయిన శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారి గురించి ఈ నెల బాలచైతన్యంలో తెలుసుకుందాము. తెలుగువాడై ఉండి, స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, గాంధీ గారిచే "విశ్వదాత"గా కొనియాడబడిన ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు వీరికింకా 'దేశోద్ధారక', 'దేశబంధు'చ 'కళాప్రపూర్ణ' బిరుదులు కూడా కలవు.



కృష్ణాజిల్లాలో గల గుడివాడ తాలూకా లోని, పామర్రు మండలంలో గల 'యలకుర్రు' అనే గ్రామంలో 01,.05.1867 నాడు శ్రీ కాశీనాధుని బుచ్చయ్య - శ్యామలాంబ దంపతులకు శ్రీ నాగేశ్వరరావు గారు జన్మించారు.

వీరు తమ ప్రాథమిక విద్యను స్వగ్రామంలో కానిచ్చి, పిదప మచిలీ పట్నంలో కొనసాగించారు. 1891లో మద్రాసులో గల మద్రాసు క్రిస్టియన్ కాలేజ్ నుంచి పట్టభద్రులయ్యారు. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారిని శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారని కూడా వ్యవహరించేవారు.

శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారి వ్యాసాలు 'వివేక వర్ధని'లో చదివి శ్రీ నాగేశ్వరరావు గారు అమితంగా ప్రభావితు లయ్యారు. స్వాతంత్ర్యోద్యమంలో శ్రీ మహాత్మాగాంధీ గారి ప్రభావం, ఆయన విధానాలు శ్రీ నాగేశ్వరరావు గారిని మిక్కిలి ప్రభావితం చేశాయి. స్వాతంత్ర్య సమరంలోనూ, సహాయ నిరాకరణోద్యమం లోనూ, ఉప్పు సత్యాగ్రహంలోనూ శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు పాల్గొన్నారు.

# ఎలక్ట్రాన్

# గీతెక్కడ గీయాలి?



ప్రతి పనినీ టెండర్లు పిలిచి గుత్తేదారులకి అప్పగించే బదులు "ఇన్ హౌస్ కాపబిలిటీస్"ని కూడా మనం అభివృద్ధి చేసుకోవాలి."

"కార్మిక సంఘాలతో వేగడం కష్టంలే" ఎవరో అభ్యంతర రూపంలో కాకుండా సలహా రూపంలో ఓ విసురు విసిరారు.

"సహకార కార్మిక సంస్థలు కొన్ని నెలకొంటున్నాయి. వాటిలో పలువృత్తులకు సంబంధించిన పనివారుంటున్నారు. దినవేతనాలు లేబర్ కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం నిర్ణయించబడుతున్నాయి. వారి సేవల్ని ఉపయోగించుకొందాం."

"నాణ్యత లోపించే అవకాశముంటుంది."

"బండ రాళ్ళతో మొండిపని చేసే ధృఢత్వం సాధించవచ్చు. దాని రూపకల్పనలో కౌశల్యముంటే సున్నితమైన నిర్మాణంలో కూడా- అంతే లేదా అంతకంటే మిన్న అయిన ధృఢత్వం సాధించవచ్చు. మనదేశంలోని పై ఓవర్లకీ, విదేశాలలో ఉన్న పై ఓవర్లకీ మధ్య భేదం మీరు గమనించే ఉంటారు. ఇప్పుడు ఈ మూడోదశ నిర్మాణం రూపకల్పన చేసేది, చేబట్టేది మనం. పనిచేయించేది మనం. పర్యవేక్షణ చేసేది మనం. నాణ్యత లోపిస్తే బాధ్యత వహించాల్సిందే మనమే. కార్యక్షేత్రంలో మన సాంకేతిక పరిజ్ఞానమూ, పరిపాలనాదక్షత పరిపూర్ణం కావడమే నా ఉద్దేశ్యం."

అందరూ తలలు పైకీ కిందకీ, అటూ ఇటూగా ఆడించి సమావేశంలోంచి జారుకొన్నారు. కూతురికి పెళ్లిసంబంధాలు చూడాలని రంగారావూ, తల్లికి ఒంట్లో బాగోలేదని సోమరాజు వారం రోజులపాటు సెలవు పెట్టేశారు. రామకృష్ణ ముగ్గురు చిన్న ఆఫీసర్లతో చర్చలు జరిపి, వారంరోజుల్లో మూడోదశ నిర్మాణానికి కొత్త రూపకల్పన చేశారు. వారిలో కులపతి కూడా ఉన్నారు. అంచనాలు కులపతి వేసిన అంచనాలకు రెండు శాతం అధికంగా ఉన్నా, రూపకల్పనలోని మార్పులవల్ల అవి సమంజసమే అనిపించింది కులపతికి. రామకృష్ణకి శాఖాపరంగా నిర్మాణం చేబట్టడానికి అనుమతులు అంత సులువుగా లభించలేదు. అయినా పట్టువిడవక లాభనష్టాల పేచీలు చూపించి ఒప్పించారు. మూడోదశ నిర్మాణం ఏడాదిలోగా ముగిసింది. మొదటి మూడు నెలలూ కావల్సిన నిర్మాణ వస్తుసామగ్రి కొనిపించి సిద్ధం చేయించారు. తర్వాత తొమ్మిది నెలల్లో నిర్మాణం నిరాటంకంగా జరిగింది. రూపకల్పనలోని మార్పులవల్ల ఆ సవరణలు చేయాల్సివచ్చిందని చెప్పేవారని యుక్తిగా ప్రచారమేమీ చేయలేదు. వసంల్లో రంగారావూ, సోమరాజు అంటీముట్టనట్టుగా తప్పించుకొని తిరిగారు. తాము అర్పించిన అంచనాలకు పదిహేను శాతం తక్కువ ఖర్చులో ప్రణాళిక పూర్తికావడంతో వారిద్దరికీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ విమర్శించే ధైర్యం లేకపోయింది.

శీఘ్రగతిలో పూర్తయిన ఆ ప్రణాళిక సాంకేతిక నిపుణుల ప్రశంసలను అందుకొంది. మీడియా కూడా రామకృష్ణ బృందాన్ని కొనియాడింది. ఓ ఒంటరి సమయంలో రామకృష్ణ కులపతిని అభినందించారు.

"మీరు నా భార్యకి రాసిన ఉత్తరం మా ఇద్దరికీ ఓ మైలురాయిగా మారింది. సాధించిన జయం ముఖ్యంగా మీకారణంగానే!"

"సార్! ఈ మాట ఎవరితోనూ అనకండి. లేకపోతే నేను రాబందులకి శత్రువుగా మారిపోతాను. నవ సమాజ

# వేమూరి వేంకటేశ్వరరావు



## అణు సిద్ధాంతంలో రసగుళికలు

**1.అణువు అంటే ఏమిటి?**

గ్రీకు భాషలో "అ" అనే పూర్వ-ప్రత్యయం 'కానిది' అనే అర్థాన్ని ఇస్తుంది; సంస్కృతంలో అశుభ్రం అంటే 'శుభ్రం కానిది' అయినట్లు. గ్రీకు భాషలో "తోమోస్" అంటే 'కత్తిరించు' అనే అర్థం వస్తుంది. ఈ రెండింటిని సంధించగా వచ్చిన మాట "అతోమోస్" అంటే కత్తిరించడానికి వీలు కానిది లేదా అవిభాజ్యం. ఇందులోంచి వచ్చిన "ఏటం" (atom) అంటే విభజించడానికి వీలు పడనంత చిన్న పదార్థం. గ్రీకు, సంస్కృతం జ్ఞాతి భాషలు. సంస్కృతంలో ఈ రెండు మాటలని పోలిన మాట "ఆత్మ." ఈ ఆత్మ స్వభావం ఎటువంటిదో ఋగ్వేదంలో వచ్చే నారాయణ సూక్తం ఇలా చెబుతుంది:

**'నీవార-శూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా । తస్యాః శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః"**

అంటే, ఆత్మ అణు ప్రమాణంలో, మన హృదయ పీఠంలో వ్యవస్థితమై ఉంటుందని చెబుతోంది. ఈ వేద మంత్రాన్ని బట్టి అణువు అనే మాట వేదంలో ఉండడమే కాకుండా ఆత్మకి అణువుకి ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్లు అనిపిస్తోంది కదా! భగవద్గీత ఏమంటోంది?

**'నైనం ఛిన్దన్తి శస్త్రాణి, నైనం దహతి పావకః"**

అనగా, (అణుప్రమాణంలో ఉన్న) ఈ ఆత్మని కత్తితో కొయ్యలేము, మంటలో వేసి కాల్చలేము. ఆధునిక శాస్త్రంలో "ఏటం" అన్న ఇంగ్లీషు మాటకి డాల్టన్ ఇచ్చిన నిర్వచనం కూడ ఇదే కనుక అణుప్రమాణంలో ఉన్న ఆత్మకి అణువుకి మధ్య ఉన్న పోలికని బట్టి "ఏటం" కి అణువు సమానార్థకమైన తెలుగు మాట అని మనం నిర్ధారించవచ్చు.

**2. అణు సిద్ధాంతం**

సా. శ 1808 లో, బ్రిటిష్ వాడైన జాన్ డాల్టన్ ఏమన్నాడు? ప్రతి రసాయన మూలకానికి తనదైన ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన (అనగా, విభజించడానికి వీలు కాని) అణు (atom) రూపం ఉంటుందనిన్నీ, ఈ స్థూల ప్రపంచంలో మనకి తారసపడే ప్రతి వస్తువు ఈ అణువులు సమ్మేళనమే అని అభివర్ణించేడు. మన సంప్రదాయంలో కాణాదుడు దరిదాపు ఇదే భావాన్ని శతాబ్దాలకి ముందే ప్రవేశ పెట్టేడు. పైపెచ్చు కణాదుడు ద్వయాణువు, త్రయాణువు అని అణువుల గుంపులకి పేర్లు పెట్టేడు. అనగా, నేటి బణువు (molecule) అనే భావానికి అంకురార్పణ చేసేడు. కాణాదుడు తరువాత మన దేశంలో ఈ బాణీలో ఆలోచన కొనసాగించినవారు లేకపోయారు.

**3. అణువు నిర్మాణ శిల్పం**

సా. శ 1896 లో, యూరోప్ లో, హెన్రి బెక్వెరల్, మరీ క్యూరీ, పియేర్ క్యూరీ ప్రభృతి సిద్ధంగా జరిగే "రేడియో ధర్మం" అనే ప్రక్రియని అధ్యయనం చేస్తూ "కత్తిరించడానికి కూడా వీలు పడని సూక్ష్మాతి సూక్ష్మమైన అణు రూపం" అని మనం అభివర్ణిస్తున్న అణువు లోపల అంతర్గతమైన నిర్మాణశిల్పం ఉందనే భావానికి పునాదులు వేసేరు. సా. శ 1897 లో, బ్రిటన్ లో, కేథోడ్ కిరణాల మీద పరిశోధన చేస్తున్న జె. జె. థాంసన్ ఏమన్నాడంటే కేథోడ్ కిరణాలు నిజానికి విద్యుత్ తత్త్వం పూనిన, ఉదజని అణువు కంటె చిన్నవయిన, రేణువులు

# డా. పి. ఆర్. శాస్త్రి



## అందం - ఆత్మ విశ్వాసం



ఈ మధ్య సమస్యగా మారిన ఉలిపిరులు, మొటిమలు, పొక్కులు, మచ్చలు, చర్మం తేమను కోల్పోవడం (లేదా ) జిడ్డుగా మారడం... ఇవి అందానికి అవరోధంగా మారి, మన ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీస్తాయి. బజారులో కొనే క్రీములు తాత్కాలికంగా ఉపశమానాన్ని ఇస్తాయి లేదా అవి వాడినంతవరకు సమస్యలు రావు. వాడడం మానేసిన వెంటనే ఉన్న సమస్యలు, కొత్త సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరి మన ప్రాచీన పద్ధతుల ద్వారా చక్కని పరిష్కారాలు ఉన్నాయి. కొద్దిపాటి శ్రమతో ... కృషి పట్టుదలతో అందం రెట్టింపు చేసుకుని ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పొందగలము.

మేక పాలు లభ్యం అయితే వాటిని తెచ్చుకుని, ఒక గ్లాసు పాలు కాచి చల్లార్చి గోరు వెచ్చని పాలల్లో తేనె కలుపుకుని 40 నుండి 100 రోజుల వరకు తాగాలి. ఈ పాలు తాగే ముందు గంట, తరువాత గంట ఏ ఆహారము తీసుకొనరాదు.

ఈనిబంధన ఖచ్చితంగా పాటించాలి.

ఈ విధంగా చేస్తే చర్మానికి సంబంధించిన ఏ విధమైన కఠిన సమస్య అయినా పూర్తిగా నయం అవుతుంది.

దీనితో పాటు సరియైన సమయానికి నిద్రించుట, చక్కని ఆహారం తీసుకొనుట, తప్పని సరిగా వ్యాయామం చేయుట చేస్తే కాంతులీనే చర్మం మీ సొంతమవుతుంది.

**మరో చిట్కా------ మళ్లీ**



చిగుళ్లు ఆరబెట్టి దంచి పొడిగా చేసుకుని, ఆ పొడిని పచ్చి పాలతో ముద్దగా చేసుకుని కలుపుకుని రాత్రి ముఖానికి మచ్చలపై రాసుకుని ఆ లేపనంతోనే దురించి, ఉదయం గోరు వెచ్చ కుంకుడు రసంతో మర్దనా చేసి నీటితో కడిగేసుకోవాలి. ఇలా 40 రోజులు క్రమం తప్పకుండా చేస్తే మచ్చలు పోయి ఆరోగ్యవంతంగా అందంగా ఖచ్చితగా అవుతుంది .

మరో పరిష్కారంతో వచ్చే నెలలో ..... కలుద్దాం

పి . ఆర్. శాస్త్రి .
9949938691.

48 సామాజిక విలువల మాసపత్రిక ఏప్రిల్ 2017

# డా.కవన శర్మ



## పరిమాణిక సిద్ధాంతం

గత సంచిక తరువాయి

### ౫. విశ్వ వీక్షణం లో స్థానం మార్పు ( విస్థానం paradigm shift )

థామస్ కుహ్న్ 1962 లో 'సైన్స్ విప్లవాల నిర్మాణం' అనే ఒక పుస్తకం వ్రాయటం ద్వారా పెద్ద దుమారం లేపాడు

శాస్త్రజ్ఞులు తమ సమాచారాన్ని విశ్లేషించటానికి, వ్యాఖ్యానించటానికి ఆధారపడే మౌలికమైన ఊహానాల చట్రాన్ని వర్ణించటానికి ఈ మాట వాడాడు. ఉదాహరణకి ఒక బోంది ( body) కదిలితే దాన్ని ఒక బలం కదుపుతోందనే భావం న్యూటనిక చలన న్యాయాల లో ఇమిడిఉండగా, ఆ న్యాయాలు అంతకంటే విస్తృతమైన కారణం-ప్రభావం అనే ఊహానంలో భాగాలు. అటువంటి విస్తృతమైన ఊహానాన్ని విశ్వ వీక్షణం అంటాడు కుహ్న్. యురనస్ గ్రహ గతి లో న్యూటనిక న్యాయాలకి అనువర్తం కాకుండా ఉన్న ఒక చిన్న సమాచారం ( data) శాస్త్రజ్ఞులబుద్ధికి పని కలిపించి కారణం వెతికేలా చేసింది.1846 లో వారికి నెప్ట్యూన్ అని అంతవరకు గమనించని మరో గ్రహ గురుత్వాకర్షణ కారణం అని తెలిసింది. న్యూటనిక విశ్వవీక్షణం దీనిని తన లో జీర్ణించుకుంది. అందుచేత మార్పు అవసరం అవలేదు.

అయితే బుధ గ్రహ భ్రమణం లో గమనించిన చిన్న విరుద్ధ సమాచారం మాత్రం, అప్పుడు ఉన్న విశ్వ వీక్షణంలో ఇమడలేదు. ఇంతవరకు గమనించని కొత్త గ్రహాల ఆచూకీ దొరకలేదు. ఐన్ స్టీన్ ప్రతిపాదించిన సాధారణ (ప్రత్యేకమైనది కాకుండా అన్నింటికీ వర్తించే ) సాపేక్ష సిద్ధాంతం దానిని వివరించింది. ఈ సిద్ధాంతం, అప్పటి విశ్వ వీక్షణం తన స్థానం మార్చుకునేలా చేసింది.

సాపేక్షత, పరిమాణిక గమనాలు, గందరగోళం సంక్లిష్టత అనే కొత్త శాస్త్రాలకు సంబంధించిన పెద్ద సిద్ధాంతాలు వేరువేరు గా కనిపించినా వీటన్నిటిని తనలో ఇముడ్చుకోగల ఒక కొత్త విశ్వ వీక్షణం ఏర్పడింది. సమస్తత (holism), అకారణత (acausality), పరిశీలకుల భాగసామ్యం (nonduality అద్వైతం), విభిన్నత ( nonlinearity) దాని ఊహానల లో ఉన్నాయి. వీలువెంబడి నా శక్తినునసరించి, కొత్త సైన్సు కి సంబంధించిన కొన్ని విషయాలని వివరిస్తాను.

### ౬. రెండో సైన్స్ విప్లవం - ఆవశ్యకత

న్యూటనిక సైన్స్ లో వ్యవస్థ యొక్క నిర్మాణం ఒక అంతస్థుల నమూనాలో ఉంటుంది . కారణం -ప్రభావం ( cause and effect) అనే గట్టి న్యాయాలతో జరగబోయే సరళమైన మార్పుని ఈ సైన్స్ ఇస్తుంది. దీని 'ప్రదేశం-కాలం' చట్రం లో సత్యం అవును గానే కాదుగానే ఉండాల్సిందేగాని సందిగ్ధం ఉండటానికి వీల్లేదు. భిన్నత్వం తో ఇది వేగ ( చాల ) లేదు. ఇదీ, అదీ కూడాను, అనే కొత్త ఆలోచన యొక్క అవసరమైంతే తెలుస్తోంది కానీ దానికి

# నండూరి సరోజాదేవి



సీరియల్

## మిస్ మేఘమాల IAS




(గత సంచిక తరువాయి)

"అయినా, మేము ఇద్దరం ఒక్కలాగే వుంటాం కనుక, ఎవ్వరు తేడా తెలుసుకోలేకపోవచ్చు" అని నవ్వుతూ మేఘమాల బలవంతాన.. మాలతిని, తన కుర్చీలో కూర్చోపెట్టింది.

అంతే కాదు! మేఘమాల ఆ కుర్చీ చేతిమీద ఆని కూర్చుని, మాలతి భుజం చుట్టూ ఎడం చేతిని వేసి పట్టుకుని.. తన సెల్ ఫోన్తో, వినోద్ ని ఒక ఫోటో తీయమంది. తర్వాత వినోదుని, మాలతినీ పక్క పక్కన నిలబెట్టి.. తనూ వాళ్ళ పక్కన నిల్చుని ఒక సెల్ఫీ ఫోటోని కూడా తీసింది!

ఆ ఫోటోలు చూసుకున్న మాలతికి ఆనందంతో మొహం ఇంతయ్యి, మేఘమాలని ఒక్కసారి గట్టిగా కౌగలించేసుకుంది!

దాంతో మేఘమాల కూడా, మాలతి వీపుని ఆప్యాయంగా నిమిరి..తిరిగి తనని ఆ కుర్చీలో కూర్చోమంది!

"అన్నట్టు, వినోద్! మీ కోసం తెప్పించాను" అంటూ రెండు సెల్ ఫోను బాక్సులు డ్రాయర్ లోంచి తీసి, వాళ్ళిద్దరి చేతులకి చెరొకటి ఇచ్చింది మేఘమాల.

"అయ్యో! నువ్వెందుకు కొన్నావ్ మేఘమాలా? నేను తర్వాత తీసుకునే వాడిని కదా?"అన్నాడు వినోద్ కాస్త గట్టిగా.

"ఏం,నేను కొంటే తప్పా? నా వాళ్ళ కోసం ఇలా ఏంచేసినా నాకెంత సంతోషం అనిపిస్తుందో తెలుసా?"లో గొంతుకతో అంది మేఘమాల.

"ఛ,ఛా! నా ఉద్దేశ్యం అది కాదు, నువ్వేం ఫీలు కాకు!" అంటూ చనువు తీసుకుని, మేఘమాల భుజం తట్టాడు వినోదు.

"పర్వాలేదులే"అని మేఘమాల కూడా వెంటనే అంది.

"మాలతీ! మనం ఇంక వెడదామా?మేఘమాలకి మీటింగ్ టైము అవుతుందేమో?"భార్యతో అన్నాడు వినోదు.

"అలాగే" అంటూ మాలతి కుర్చీలోంచి లేచింది!

"వినోద్! అదేదో నేను చూసుకుంటాను కానీ, మీరు ఒక గంట వెయిట్ చేస్తే .. ఒకసారి షాపింగ్ చూసుకుని, ఇంటికి వెడదాము" అని చెప్పింది మేఘమాల.

"షాపింగ్ కి ఎందుకు,నువ్వు ఏమైనా తీసుకోవాలా?" అడిగింది మాలతి.

"నాక్కాదు, మీకు కొనడానికే!"

"ఇవి కొన్నావు కదా,ఇంక మరేం వద్దులే!" మొహమాటంగా అంది మాలతి.

"అది, నాకొదిలి పెట్టేయమ్మ మాలతీ!" అని నవ్వుతూ చెప్పి..

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు






# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -14)

పాఠం -- Lesson-14

### Unit-1

अद्यतन (adyatana) (ఈనాటి) )—श्वस्तन (shvastana ) (రేపటి) – ह्यस्तन (నిన్నటి) (hyastana) —पूर्वतन (ప్రాచీనమైన) (purvatana) —इदानीन्तन (idaaneentana) (ఇప్పటి)

अद्यतन **the period of a current day.(Of today)—**श्वस्तन **future (tomorrow's)** ह्यस्तन **(of yesterday)—**पूर्वतन **0lden—**इदानीन्तन **present, momentary, of the present moment.**

**SOME EXAMPLES:**

| | |
|---|---|
| 1. एष: अद्यतन: पाठ: | ఇది ఈనాటి పాఠము (This is today's lesson) |
| 2. स: ह्यस्तन: पाठ: | అది నిన్నటి పాఠము (That is yesterday's lesson) |
| 3. एष: श्वस्तन: पाठ: | ఇది రేపటి పాఠము (This is tomorrow's lesson) |
| 4. एषा अद्यतना पत्रिका | ఇది నేటి పత్రిక (This is today's magazine) |
| 1. सा ह्यस्तना पत्रिका | అది నిన్నటి పత్రిక ( That is yesterday's magazine) |
| 2. एषा श्वस्तना पत्रिका | ఇది రేపటి పత్రిక ( This is tomorrow's magazine) |
| 3. एतत् गृहं पूर्वतनम् | ఈ ఇల్లు పాతది ( This house is of ancient times) |
| 4. अयं व्यवहार: इदानीन्तन: | ఈ వ్యవహారం ఇప్పటిది (This affair is of present times) |

### Unit-2

गत x आगामि

गत= **any thing past or done** (జరిగిపోయిన )
आगामि= **coming , future** (రాబోయే ).

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : జ = అసలు అక్షరం 'న' )

టే యు దా కం డ  పి చు జి  రూ లిం త గే జి

జో కు  జౌ చ్చం డ  మ కి సీ క్యి  జు గు చ గే జి

వ బ బు  హా య్యుం రు  దో జు డా  వ ద త గే జి

డ దు డ  జే సి ని  వ ద్దు ద  న గు తు  లే సు

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ము బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతిసేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ!

మార్చి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ పి. రావు

42 సామాజిక విలువల మాసపత్రిక ఏప్రిల్ 2018

# ఆదూరి హైమవతి



## ఒకటే వృత్తి

శ్రీరామచంద్రుడు 'పితృదేవోభవ' అనే సిద్ధాంతాని.కి కట్టుబడ్డ ఆదర్శ కుమారుడు. ఆయన తన తండ్రి పినతల్లికి ఇచ్చిన మాట పాటించడం కోసం ,భార్య అయిన సీతతో, అన్నను వదలి ఉండలేని తమ్ముడు లక్ష్మ-ణుడు వెంట రాగా వనవాసానికి బయల్దేరాడు.

దార్లో వారు గంగానదిని దాటవ-లసి వచ్చింది.

గుహుడు అనే పడవ నడిపే వాడు మహా రామభక్తుడు, ఆయన్ని సీతా, లక్ష్మణ సమేతంగా నావలో దాటించిన సమయంలో జరిగిన చిత్రం ఇది.

గుహుడు రామభక్తుడే.ఐనా అతడు, శ్రీరాముడు పూర్వం విశ్వామిత్రుని వెంట నడుస్తూ యజ్ఞసంరక్షణార్థం, రాక్షసుల-ను హతమార్చను విశ్వామిత్రుని వెంట ఆశ్రమానికి నడచి వెళ్తు-న్నప్పుడు, ఆయన కాలి స్పర్శకు ఒకరాయి స్త్రీ గా మారిన[అహ-ల్య] విషయం విని ఉండటం వలన, శ్రీరాముడు తన నావలో కాలు పెడితే తన నావ కూడా స్త్రీ గా మారిపోతుందని, భయపడి ఆయన కాళ్ళు కడిగి ఏమాత్రం ధూళి లేదని నమ్మకంకలిగాక మాత్రమే శ్రీరాముని తన నావలో అడుగు పెట్టనిచ్చాడు.

అంతరార్థం - అరూపంగా శ్రీరా-ముని పాదాలు కడిగే అవకాశం సంపా దించుకో నే!.

అంతేకాక ఏమీ చదువుకోని ఓపల్లె వాడైన పడవవాడు మన అందరికీ ఎంతో చక్కని సందేశం ఇచ్చాడు. అదేమంటే--

శ్రీరాముని పాదాలు కడిగిన తర్వాత గుహుడు, రాముని, సీతను, లక్ష్మణుని పడవలో ఆవలి ఒడ్డుకు చేర్చుతున్న సమ యంలో, శ్రీరాముడు సీతామాత-తో 'సీతా! మనల్ని నది దాటిస్తున్న ఈ పడవ వానికి ఏదైనా ఇవ్వను నా వద్ద ఏమి లేదు.నాకు సంబం-ధించిన సర్వమూ దానధర్మాల-క్రింద ఇచ్చేసి వచ్చాను కదా! ఈ వృత్తిలో జీవిస్తున్న ఇతనికి ఏమి ఇవ్వకపోడం ఉచితం కాదు. ఎవ్వరి నుండీ ఉచిత సాయం పొందకుడదుకదా! నీ వద్ద ఏమై-నా ఉంటే ఇతనికి ఇవ్వడం, బావుంటుంది' అని చెప్తాడు.

దానికి వెంటనే సీతామాత తన వేలి కున్న ఉంగరాన్ని తీసి శ్రీ-రామునికి ఇచ్చి, గుహునికి ఇవ్వ మని సౌజ్ఞ చేసింది.

శ్రీరాముడు ఆ ఉంగ-రాన్ని అందుకుని, గుహునితో 'ఓ నావికా! మమ్ము నీవు శ్రమ-పడి గంగానదిని దాటిస్తున్నావు. నీ శ్రమను మేము ఉచితంగా పొందకూడదు, కనుక నీవు ఈ ఉంగరాని స్వీకరించవలసింది" అంటూ ఆ ఉంగరాన్ని అతనికి ఇవ్వబోయాడు.

గుహుడు వెంటనే "ఓ రామ ప్రభూ! ఒకే వృత్తిలో ఉన్నవా-రు పరస్పర సహాయానికి, ధనం తీసుకోడం ఉచితం కాదు. ధర్మమూ కాదు" అన్నాడు.

దానికి ఆశ్చర్యంగా శ్రీరాముడు "ఏమి! ఒకే వృత్తిలో ఉన్నవారు పరస్పర సహాయానికి బదులుగా ధనం తీసుకోరాదా?" అని అడిగాడు.

గుహుడు "ఔను ప్రభూ! ఒక మంగలి తనవలె అదే వృత్తిచే-సే మరో మంగలికి తలపని చేస్తే ధనం తీసుకోడం ధర్మంకాదు' అన్నాడు.

శ్రీరాముడు అది విని "అలాగా !" అని బదులివ్వగా-- గుహుడు 'ఔను ప్రభూ! అలాగే ఒక రజకుడు తన లాంటి వృత్తి చేసే మరో రజకునికి ఏదైనా సాయం చేసినప్పుడు అతని వద్ద నుండి

సామాజిక విలువల మాసపత్రిక | ఆగస్టు 2019 | 33

చైతన్యం

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



## ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

కృష్ణమోహన్ ఫోన్ చెయ్యగానే మొదటి రింగ్కే ఫోన్ ఎత్తి 'హలో' అంది అనూరాధ.

"హలో ఎవరు రాధేనా మాట్లాడుతున్నది"

"అవును బావా నీకు ఎలా వుంది, నొప్పి పూర్తిగా తగ్గిందా?" అని ఆతృతగా అడిగింది.

"నిన్ననే చెప్పాను నొప్పి లేదని, నేను ఫోన్ చెయ్యకపోతే నువ్వు అనవసరమైన ఆలోచనలు చేస్తూ కుదురుగా వుండవని ఫోన్ చేసాను"

"థాంక్యూ బావా, మళ్ళీ ఎప్పుడు వస్తావు" అని అడిగింది అనూరాధ.

"వీలున్నప్పుడు వస్తాను. అనవసరమైన ఆలోచనలు చెయ్యకుండా నీ దృష్టి అంతా నీ చదువు మీద పెట్టు, ఇక వుంటాను" అని ఫోన్ పెట్టేసాడు. తరువాత సుమారు ఒక నెల పాటు కృష్ణమోహన్ రాధ వాళ్ళింటికి వెళ్ళలేదు. మధ్యలో రెండు సార్లు రవి ఫోన్ చేసి రమ్మన్నాడు కాని వివిధ కారణాల వల్ల వెళ్ళలేకపోయాడు.

రవి, రాధ బలవంతం చేస్తే డిశంబర్ 31వ తేదీ సాయంత్రం వెళ్ళాడు. ఆ రోజు రాత్రి భోజనం చేసి వాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ, అష్టాట ఆడి, పాటలు పద్యాలతో అర్ధరాత్రి వరకు అందరు సరదాగా గడిపారు.

అర్ధరాత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకున్న తరువాత నూతన సంవత్సర సందర్భంగా రాధ చేసిన గులాబ్ జాం తిని "ఇక నేను బయలుదేరుతాను" అన్నాడు కృష్ణమోహన్.

"వుండు బావా నేను డ్రాప్ చేస్తాను" అన్నాడు రవి.

"వేయ్ మోహన్ ఈ వేళప్పుడు ఎక్కడికి వెళ్తావు, కొత్త సంవత్సరము పేరు చెప్పి ఈ అర్ధరాత్రి పనీపాటా లేని తాగుబోతులంతా రోడ్డెక్కి హడావిడి చేస్తూంటారు, ఇక్కడే పడుకుండిపో తెల్లారగట్టే వెళుదువుగాని" అన్నారు పార్వతమ్మగారు

"లేదండీ నేను కొంచం ఆలస్యంగా లేస్తాను, రేపు ఉదయం తొమ్మిదికల్లా కాలేజీలో మా ప్రొఫెసర్ గారిని ఒక ముఖ్యమైన పనిమీద కలవాలి టైం సరిపోదు" అన్నాడు కృష్ణమోహన్.

"పరవాలేదయ్యా ఒక గంటన్నర ముందు లేస్తే సరిపోతుంది రవి స్కూటర్ మీద డ్రాప్ చేస్తాడు" అని అతనిని వెళ్లనివ్వలేదు పార్వతమ్మగారు. పెద్దలు, పిన్నలు పడుకున్నారు, రవి, అనూరాధ, కృష్ణమోహన్ మిగిలారు.

"బావా సంక్రాంతి తరువాత హైదరాబాద్ వెళ్ళాలి, నాకు ఒక కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది" అన్నాడు రవి.

"వెరీ గుడ్, ఎప్పుడు ఇంటర్వ్యూ, ఎప్పుడు బయలుదేరుతున్నావు" అని అడిగాడు కృష్ణమోహన్.

"21వ తేదీ బయలుదేరుతాను, 23న ఇంటర్వ్యూ తిరిగి 25న బయలుదేరుతాను"

"హైదరాబాదులో వుండటానికి ఎవరైనా వున్నారా లేకపోతే మొహమాటపడకు నా ఫ్రెండ్స్ వున్నారు"

"థాంక్యూ బావా అఖ్ఖర్లేదు, మా మేనమామ వాళ్ళు వున్నారు"

"ఆల్ ది బెస్ట్ రవి, గుడ్ లక్"

"థాంక్యూ బావా"

తరువాత కాసేపు ముగ్గురూ కబుర్లు చెబుతూ వుండగా రవి నిద్రలోకి జారుకున్నాడు. "రాధా నువ్వూ వెళ్ళి పడుకో, నాకు ఇంకా నిద్ర రావడంలేదు. కాసేపు ఏదైనా పుస్తకం చదువుతాను"

"నాకూ నిద్ర రావడం లేదు ఒక పని చేద్దాము, హాల్లో కూర్చుని

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

### సాహిత్యం

ఆ చుట్టుపక్క పది ఊర్లలో సాహిత్యానికి మా ఊరు పెట్టింది పేరు. సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు మెండుగా వుండేవారు. తీరిక చిక్కినప్పుడల్లా సాహితీ గోష్టి నడుస్తూ వుండేది. ఈ గోష్టిలో ముఖ్యంగా చెప్పుకోతగ్గది మహాభారతం.

మహాభారతం విరాట్ పర్వానికి ఒక ప్రత్యేకత వుంది. ప్రతి సంవత్సరం ఈ విరాట్ పర్వం పురాణ పఠనం జరుగుతుంది. వర్షాలు సకాలంలో పడాలంటే విరాట్ పర్వం చదివేవారు. పద్దెనిమిది రోజులపాటు రాత్రి పూట ఓ రెండు గంటలు విరాట్ పర్వం చదవటం, దానిని వ్యాఖ్యానించటం జరుగుతుంది. అరణ్యవాసం, అజ్ఞాతవాసం అయిపోయిన తర్వాత ఉత్తర గోగ్రహణంతో ఉత్తరుడు రథ సారథిగా బృహన్నల యుద్ధం చేస్తూ, బృహన్నలే అర్జునుడని తెలుసుకున్న తరవాత కౌరవులు మళ్ళీ పాండవులను అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి అవలేదని పేచీ పెడితే .... ధర్మరాజును చెప్పమన్నప్పుడు ...

'నిండె... నిండె... నిండె' ... అంటూ పద్యం చదువుతాడు. ఆ పద్యం చదివేటప్పటికి చెరువు నిండి అలుగు పారుతూ వుంటుంది. ఆ రోజుల్లో అలా జరిగేది.

అయితే విరాట్ పర్వం చదవటం, అర్థం చెప్పటం చాలా రంజుగా వుండేది. చదవటం ప్రముఖ నాదస్వర విద్వాంసుడు, సంగీతనిధి పెద్దకేశన్న చేసేవాడు. రాగయుక్తంగా పద్యాన్ని అర్థవంతంగా చదివితే ... అర్థం చెప్పటానికి నందుల సుబ్బరామయ్య కూర్చునేవారు. అసలే కొంచెం కొంటెతనం ఎక్కువ. పండిత పామరులకు అర్థం అయ్యే విధంగా వ్యాఖ్యానించేవారు. అందుకు మహాభారతంలోని పాత్రలను నిజ జీవితంలోని మనుషులతో పోల్చి చెప్పేవారు.

తమను తాము మహాభారత పాత్రలలో చూసుకోవటానికి సాయంకాలం అయ్యేటప్పటికి అందరూ కోదండరామస్వామి గుడిలో గుమికూడేవారు. ఆముదపు దీపము వెలుగులో విరాట్ పర్వం చదువుతూ వుంటే సుబ్బరామయ్య అర్థం చెపుతూవుంటే ఆనంద డోలికల్లో తేలిపోయేవారు.

భీముని పాత్రకు నందిపల్లె బికారిని ఎన్నుకునేవారు. బికారి ముగ్గురాళ్ళ గనిలో పని చేసేవాడు. కోడూరి కొండలో ముగ్గురాళ్ళ గనులలో సగం గనులను త్రవ్వింది బికారే.

(ఇంకా ఉంది)



# కరోనా కవితలు

డా. వేదుల సుబ్రహ్మణ్యం



## కరోనా తో పోరు

బయట లాఠీల మోతకు భంగపడక
ఇంట నుండుటయే మేలు కంటబడక
ఎంతగా వేడుకొన్నను నుంతయైన
వినగ నొక్కడు నుండడు వీధి బయట II 1

వ్యాధి విస్తారమగునన్న భయము విడిచి
స్వస్థతను నిల్పు విధముగా సాయపడుచు
తరచుగా చేతులను శుభ్ర పరచు కొనుచు
ఇంటనే యుండుటొప్పగు నెల్లరకును II 2

ఇంటి నిర్బంధమున నుండ నించుకైన
బాధ్యతలు పంచుకొను గొప్ప భాగ్యమగును
ఇప్పుడున్న పరిస్థితి నెంచి జూడ
మించి కానదు వేరొక మేలు ప్రజకు II 3

ప్రజలు వ్యాధికి భీతిల్లి పరుగు లిడగ
సర్వసామర్ధ్యములు గల సాధకుండు
దేశమెల్లను పాలించు ధీరుడొకడు
పోరు సల్పగ దిగులు తా తీరిపోదె? II 4

విషపు జ్వాలలు దేశాల విస్తరించి
ఇప్పటికె మ్రగ్గి రెందరొ ఎగ్గు నుడిగి
శరణు వేడెద నయ్య ఓ గరళకంఠ !
కాడుమల్లేశ! మమ్ముల గావు మీశ II 5

దేశ మందిచ్చు జ్యోతుల దీప్తి వెడలి
వివిధ దేశాల మూలల విస్తరించి
దీపశిఖ మధ్య పరమాత్మ తేజరిల్ల
శార్వరీ మాత గాచుత జగతి నెల్ల II 6

## కరోనా యుద్ధ వీరులకు వందనములు

రోగులకు సేవలందించి బాగు చేయు
పనికి అంకితమై యుండి ప్రాణమొడ్డి
అహరహంబులు కృషిజేయు నందరకును
వందనమ్ములు శతకోటి వందనములు II 7

అలుపు సొలుపుల నెరుగక సలుపు విధులు
ప్రభుత నియమాలు నేర్పుతో ప్రజకు తెలిపి
భద్రతను కూర్చు రక్షక పాలకులకు
వందనమ్ములు శతకోటి వందనములు II 8

పారిశుధ్ధ్యము పాటించి పరిసరముల
పారిశుభ్రత కాపాడు పనులలోన
ప్రీతితో సేవ లందిచ్చు బృందములకు
వందనమ్ములు శతకోటి వందనములు II 9

వ్యాధితో పోరు సల్పి ప్రయాస కోర్చి
ప్రజల రక్షణకై తాము పరితపించి
దక్షతను నిల్పు వైద్య బృందములకెల్ల
వందనమ్ములు శతకోటి వందనములు II 10

దేశ భద్రత మదినిల్పి దిశలగాచి
ప్రాణములు లెక్క జేయక పణము పెట్టి
దేశ రక్షణకై పోరు ధీరులకును
వందనమ్ములు శతకోటి వందనములు II 11

ఒకడు విషమును పంచి ఇంకొకడు మించి
ఉగ్రవాదుల పంపినా ఉచితమెంచి
ఔషధము లందరకు పంచు నమ్మ కిత్తు
వందనమ్ములు శతకోటి వందనములు II 12

# క్రాస్ వర్డ్ పజిల్స్ - కథా కమా మేషు -1



## చాగంటి కృష్ణకుమారి

కానీ దీనికి పూర్వమే 19వ శతాబ్దం లోనే క్రాస్ వర్డ్ పజిల్ ఇటాలియన్ భాషలో "per passare il tempo" గా వాడుకలో వుంది.

ఈ పదానికి అర్థము "to pass the time."అని. అంటే 'కాలక్షేపానికై' . వీటిని రూపొందించే వారిని క్రుసి-వెర్బాలిస్ట్ లు (cruciverbalists) అంటారు.ఈ పదం లాటిన్ పదాలైన crux , verbum,లనుండి పుట్టింది . ఇంగ్లీషు లో Crux ని cross అనీ verbum ని "word." అనీ అంటారు కనక ఈ రెండూ కలిసి cross word అయింది.

నిజానికి ఆథా విన్ పజిల్ ని పాఠకుల 'కాలక్షేపం కోసం మాత్రమే రూపొందించలేదు .అవి మొదటి ప్రపంచ-యుద్ధపు రోజులు .యుద్ధ వాతావరణపు భీతి, నిరాశ , నిస్పృహలనుండి జన సామాన్యుల మానసిక స్థితిని మరల్చి ఊరటనిచ్చేందుకు తన పజిల్ ని ఒక తప్పనిసరి సాధనంగా భావించాడు .ప్రజానీకానికి ఒకానొక వ్యాపకంగా వాడుకలోకి తెచ్చాడు. అందమైన డైమండ్ ఆకారంలో ఖాళీ గడులను పేర్చి వాటిని అక్షరాలతో నింపడానికి పాఠకులకు సూచనలను తయారు చేసి ఇచ్చాడు. అతనిచ్చిన ఆధారాలను బట్టి పాఠకులు పదాలను కనిపెట్టి గడులను నింపాలి. దీనికి అతను పెట్టిన పేరు "FUN's Word-Cross Puzzle." కొన్ని వారాల తరువాత ఒకసారి పేపరులో దొర్లిన అచ్చు తప్పు వల్ల అది "Cross-Word,"అనే శీర్షికతో వెలువడింది. అదే ఖాయమైపోయింది.

1920 నాటికి అమెరికాలో పాఠకుల మెదడుకు వినోదానివ్వగల కాలక్షేపానికి క్రాస్ వర్డ్ పజిల్స్ ని చాలా పత్రికలు ప్రవేశపెట్టాయి.ఒకదశాబ్దం తిరిగేసరికి సుమారుగా అమెరికాలో అన్ని పత్రికలలోనూ ఒక్క Times లో తప్ప ఇవి చోటుచేసుకొన్నాయి. అయితే వీటిలో కొన్ని చాలా జాగ్రత్తగా చూసి పరిష్కరించినవి కాగా కొన్నింటిలో తప్పులు దొర్లడమూ వుంది. పజిల్ నిర్మాణరూపంలో కూడా ఒక పద్ధతంటూ లేకుండా వుండేవి.అధారాలివ్వడంలో, పదాల ఎంపికలో పలుచదనం చోటు చేసుకొవడమూ వుండేది.

బ్రిటన్ లో తొలిసారిగా 'Pearson's Magazine' లో 1922 ఫిబ్రవరిలోనూ , 1930 ఫిబ్రవరి 1న Times లో నూ క్రాస్వర్డ్ పజిల్స్ శీర్షికలు చేరాయి.

అమెరికన్ పజిల్స్ కన్నా బ్రిటీష్ క్రాస్వర్డ్ పజిల్స్ తమదైన ముద్రను సంతరించుకొన్నాయి . మెదడుకి బాగా పని కల్పించేవిగా తయారయ్యాయి.ఎ.ఎఫ్.రిట్చి, డి.ఎస్. మాక్నట్ (A. F. Ritchie and D. S. Macnutt) ఆధారాలు ఇవ్వడంలో పాఠకులను తికమక పెడుతూ చమత్కారాలతో పజిల్స్ పూరించడానికి అవసరమైన మేధో స్థాయిని పెంచి పూరణ కర్తల మెదడులకు పదును పెట్టారు. పజిల్స్ రూపకర్తలకు కొన్ని సూత్రాలను నిర్దేశించారు. చక్కని జ్యామితీయ నిర్మాణాలలో పదాలు నృత్యం చేస్తున్నాయా అని అనిపించేటంతగా స్వహస్తాలతో వీరు రూపందించన వేల కొద్దీ పజిల్స్ పాఠకులను విశేషంగా ఆకట్టు కొన్నాయి. వీటిని cryptic puzzles అంటారు. ఎందుకంటె మర్మగర్భితంగా ఇచ్చిన సూచన ఆధారంగా పూరించాల్సిన పదాన్ని కనిపెట్టడానికి కొంత శ్రమపడాలి.

(ఇంకా వుంది)


ASIAN WORLD RECORDS
Promoting Asian Talent Globally!
First Woman Owner, Publisher & Editor of a Magazine
Super Achiever-2021
ASIAN WORLD RECORDS
TEEGAVARAPU SHANTI
Hyderabad, Telangana, India
CHAMPION
Of
LITERATURE & PUBLICATIONS
This Citation is proudly presented to
Teegavarapu Shanti
for her outstanding contribution in the field of Literature & Publication and for achieving the World Record title " The First Woman Owner, Publisher & Editor of a Magazine."
www.championsbookofworldrecords.com
DO SOMETHING
GREAT
CHAMPIONS BOOK OF WORLD RECORDS
2021

Where Performance Records

# CHAMPIONS Book of WORLD RECORDS

## Certificate

### *FIRST WOMAN OWNER, PUBLISHER & EDITOR OF A MAGAZINE*

| | |
|---|---|
| *Name of the Record Holder* | SHANTI TEEGAVARAPU |
| *Date of Birth* | 15th January, 1955 |
| *Place of Residence* | Hyderabad, Telangana, India |
| *Area of Expertise* | Literature & Publication |
| *Details of Record* | The record for being the first Woman Owner, Publisher & Editor of a magazine with matchless contribution running for the last 10 years uninterrupted as was confirmed on 12th April, 2021. |
| *Nature of Record* | World Record |

*Your outstanding work speaks volumes of your amazing aptitudes.*
*Your commendable record is being placed in our book of records.*

*Date of Issue: 12th April, 2021*

**Dr.Pattabhi Ram.Turlapati**
Registrar of Records
**Champions Book Of World Records**

www.championsbookofworldrecords.com | championsbookofworldrecords@gmail.com

This Certificate must not be reproduced without written permission of Champions Book of World Records.

DO SOMETHING
GREAT



Where Performance Records

CHAMPIONS Book of WORLD RECORDS

# Certificate

## FIRST EVER VIDEO MAGAZINE

| | |
|---|---|
| *Name of the Record Holder* | CHAITANYAM SANKALPABALAM |
| *Year of Establishment* | 11th November, 2011 |
| *Place of Residence* | Hyderabad, Telangana, India |
| *Area of Expertise* | Literature & Publication |
| *Details of Record* | The record for bringing out Unique Video Magazine (first of its kind) with the contributions of 33 Writers as was confirmed on 12th April, 2021. |
| *Nature of Record* | World Record |

*Your outstanding work speaks volumes of your amazing aptitudes.*
*Your commendable record is being placed in our book of records.*

*Date of Issue: 12th April, 2021*

**Dr.Pattabhi Ram.Turlapati**
Registrar of Records
**Champions Book Of World Records**

DO SOMETHING
GREAT

## చైతన్యం గళ్ల నుడికట్టు -1



సూచన: - ఇక్కడిచ్చిన ఆధారాల ప్రకారం నిలువు గడులు, అడ్డం గడులు పూర్తిచేయండి.

- గళ్ల నుడికట్టు -1 సమాధానాలు వచ్చే సంచికలో ప్రచురిస్తాం.

**అడ్డం**

1. మొదటిది (3)
7. పటంలో ఈ దిక్కు (4)
8. సంగీత శాస్త్ర వేదం (2)
13. మీరు (3)
14. నీదు, దీర్ఘం లేదు, తిరగబడింది (2)
15. మనుషులు లేని చోటుని, బొత్తిగా.. లేదు అంటాం (6)
18. అల్లే కానిండి (3)
21. ఉయ్యాల (3)
22. లక్ష్మణుడి భార్య, అక్షరాలు తారుమారు (3)
27. వయసు (3)
28. 52 ముక్కలు (2)
29. .... ధర్మరాజు (2)
30. సముద్రం ఒడ్డున దొరికేది (2)
31. పుట్టినరోజు (3)
33. శ్రీలంకలోని దేవి (3)
35. ఋషి (2)
36. భర్త (2)
37. .... చిగురు తినగానే (2)
38. భూమినుంచి పుట్టింది (3)
39. ప్రవాహము (3)
41. సబ్ కో.... దే భగవాన్, అట్నుంచి (3)
43. తిరుమల తిరుపతి దేవస్థానములు (3)
46. "భు" కి దీర్ఘం ఇస్తే (1)
47. ఎత్తి జై కొట్టు తెలుగోడా (1)
50. మంచు (3)
53. ఆకాశం (2)
55. చీకటి (3)
57. కరగించి పోసేది (2)
59. విశ్రాంతి (3)
62. తోటమాలి (4)
64. వెలుగు (2)
66. ఒక దుంప (2)
68. పార్వతీదేవి నామం (3)
69. అర్హత (3)
71. ...., తానము, పల్లవి (3)
72. అసలు రూపం, అట్నుంచి (2)
73. గుమ్మం (1)
75. ఇది సరి చూసుకునే ఇల్లు కొంటాం (2)
76. తపసున చేసేవాడు (2)
77. గనుల లోంచి తవ్వి తీసేది (3)
78. సీతాదేవి (3)
80. .... బీరకాయలు (2)
81. యముడు (3)
82. కన్ను (3)

**నిలువు**

2. మంచి రక్తం తీసుకుపోయేది (3)
3. మహారాష్ట్రలోని ఒక పెద్ద నగరం (2)
4. జగమే... అన్నాడు దేవదాసు (2)
5. రాముడు (2)
6. రాచఠీవి (3)
9. .... శుభమస్తు (3)
10. చేరవలసిన చోటు (2)
11. పరుండి ఉన్నవాడు (2)
12. .... నారాయణులు (2)
16. విష్ణుమూర్తి (4)
17. వర్షాకాలంలో పట్టేది, తడబడింది (3)
19. ధర్మ సంబంధమైనది (4)
20. పెద్ద సోదరుడు (2)
23. .... పరబ్రహ్మ స్వరూపం (2)
24. పువ్వుల దండ (4)
25. చెవి, తిరగబడి సున్నా కోల్పోయింది (2)
28. ఒక తాండవం (3)
32. దండలో గుచ్చే సువాసన ఆకు (3)
34. రాజుగారి కూతురు, అట్నుంచి (5)
36. స్త్రీ (3)
40. పర్వతము (3)
42. తీగ (2)
43. శ్రీవారు ఉండేది (4)
44. తడి (2)
45. గొప్పవాళ్ళ నుంచి మనం పొందేది (2)
48. మన రైతులు పండించేది, అట్నుంచి (4)
49. పప్పు విసురుకోవటానికి వాడేది (4)
51. మర్యాద పూర్వకంగా చేసుకునేది (3)
52. ఒకటి, రెండు, .... (2)
54. పచ్చని పూవు, తిరగబడింది (3)
58. తాంబూలంలో ఆకుతో పాటు, తిరగబడింది (2)
60. రక్షించు (2)
61. పఫబభమ. రలవ (1)
63. కాళిదాసు ప్రార్థించిన దేవత (6)
65. కన్య, అట్నుంచి (2)
67. పొగరుగా ఉన్న ఏనుగు (4)
70. విప్లవకవి (2)
74. నడుము చుట్టు బిగించి కట్టేది (3)
77. ఒక పక్షి (2)
75. తెగ మాట్లాడే వాడిని "వాగ్టి... కాయ" అంటాం (3
78. శత్రువు (2)
79. దేవడి బారు. అటుంచి (3)

Edited & Published by T. Shanti at Flat No. 903, Royal Pavilion, Opp. Big Bazar, Ameerpet, Hyderabad - 16. Cell: 9440147993. Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad - 500 001. Ph. 040-23203390


అమెరికా లోని ఫ్లోరిడా రాష్ట్రంలో
ఇయాన్ తూఫాను భీభత్సం

RNI No. TELTEL/2011/39497 OCTOBER 2022 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st October Date of Posting: 8th October



Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-50000